మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 26-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 58 Issue: 58

26 ఆగస్టు 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:31 తిథి త్రయోదశి ఉ. 7:58 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం శ్రవణ రా. 12:370 వరకు తరువాత ధనిష్ఠ యోగం సౌభాగ్య ఉ. 7:57 వరకు కరణం తైతుల ఉ. 7:58 వరకు గరజి రా. 8:34 వరకు వర్జ్యం తె. 5:02 నుండి ఉ. 6:44 వరకు దుర్ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:42 వరకు రాహుకాలం మ. 12:17 నుండి మ. 1:51 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:11 వరకు గుళికాకాలం ఉ. 10:44 నుండి మ. 12:17 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు మ. 1:32 నుండి మ. 3:15 వరకు అభిజిత్ ముహూర్తం లేదు

Circulated to Telangana
Published from Jagitial

## ప్యాకేజ్డ్ ఫుడ్ విషమే.. కానీ!

### హెచ్చరిక లేబుళ్ల ప్రతిపాదన వెనక్కి.. కంపెనీల ఒత్తిడితో తగ్గిన ఎఫ్ఎస్ఎస్ఏఐ



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై ముద్రించే హెచ్చరిక లేబుళ్ల విషయంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వెనక్కి తగ్గింది. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహార ప్యాకె ట్ల ముందు భాగంలో ఎరుపు రంగుతో కూడిన స్పష్టమైన హెచ్చరిక గుర్తులను ముద్రించాలన్న తన ప్రతిపాదనను విరమించుకుంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ ఏడాది మార్చిలో ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో తరువాయి 2 వ పేజీలో...



## చక్కెర తీపి

### ధరలు 18 శాతం పతనం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం చక్కెర దిగుమతులకు అనుమతి ఇవ్వడంతో ధరలు 18 శాతం తగ్గి కిలో రూ.55కు చేరాయి. ప్రస్తుతం ధరలు తగ్గుముఖం పట్టాయని, రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా తెలిపారు. ధరల పెరుగుదలకు మార్కెట్ ప్రాథమిక పరిస్థితులు అనుకూలంగా లేవని ఆయన పేర్కొన్నారు. -2 వ పేజీలో...



## ఉల్లి ఘాటు

### పెరిగిపోతున్న ఉల్లి ధర

### కట్టడికి రంగంలోకి కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో ఉల్లి ధరలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే చక్కెర ధరలు పెరిగిపోగా, ఉల్లి ఘాటుతో సామాన్యుడు బెంబేలెత్తుతున్నాడు. ఈ నేపథ్యంలో ధర ల కట్టడికి కేంద్రం రంగంలోకి దిగింది. ఉల్లి నిల్వల్ని పెంచుతోంది. ఇందుకోసం మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రత్యేకంగా కంద తరువాయి 2 వ పేజీలో...

# ప్లాన్ సక్సెస్..!?

### కొండా సురేఖ టార్గెట్‌గా కుట్రలు?.. ఉమ్మడి వరంగల్‌లో పరపతి తగ్గించే ఎత్తుగడలు?

### ఓ వర్గం దెబ్బకు కొండా ఫ్యామిలీ కుదేల్?.. తాజాగా, వేటుకు క్రమశిక్షణ కమిటీ సిఫార్సు



ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ రాజకీయాల్లో కొండా ఫ్యామిలీ చుట్టూ చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు కొత్త చర్చకు దారితీస్తున్నాయి. కొండా కుటుంబ రాజకీయ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు కాంగ్రెస్‌లోని ఒక వర్గం వ్యూహాత్మకంగా పావులు కదిపిందా? పరకాల కేంద్రంగా ఆ ప్రయత్నాలు మొదలయ్యాయా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఇటీవలి పరిణామాలను వరుసగా పరిశీలిస్తే.. పరకాల రాజకీయాల నుంచి మొదలైన అంతర్గత విభేదాలు క్రమంగా కొండా కుటుంబం వర్సెస్ కాంగ్రెస్‌లోని మరో వర్గంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని కొందరు నేతలు విశ్లేషిస్తున్నారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్రబిందువయ్యాయి. అనంతరం కాంగ్రెస్ నాయకత్వం ఆ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించింది.

(ఈవార్తలు – తెలంగాణ పొలిటికల్ బ్యూరో)

సుస్మిత వ్యాఖ్యల వెనుక అసలు నేపథ్యం ఏమిటన్నది ఇప్పుడు రాజకీయ చర్చగా మారింది. కొండా కుటుంబాన్ని రాజకీయంగా ఒంటరి చేయాలనే ప్రయత్నంలో భాగంగానే కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయన్నది ఒక వాదన. ముందుగా రాజకీయంగా స్పందించే పరిస్థితిని సృష్టించి, ఆ తర్వాత అదే వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని కొండా కుటుంబంపై పార్టీ అంతర్గత ఒత్తిడిని పెంచారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుస్మిత వ్యాఖ్యల అనంతరం కొందరు కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు కొండా కుటుంబానికి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటం ఈ వివాదానికి మరింత రాజకీయ రంగు పులిమింది. ఒక కుటుంబ సభ్యురాలి వ్యాఖ్యల వివాదం క్రమంగా మొత్తం కొండా కుటుంబ రాజకీయ ప్రస్థానంపై చర్చగా మారింది. ఇదే అంశాన్ని కొందరు తరువాయి 2 వ పేజీలో..



## 11 మంది శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లు!

### హైదరాబాద్‌లో నకిలీ సర్టిఫికెట్లతో వైద్యం

మెడిసిన్ చదవకుండానే ఫేక్ సర్టిఫికెట్లతో డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజలకు వైద్యం చేస్తూ.. వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న 11 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఆ నకిలీ డాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు.

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. నిందితుల్లో కొందరు ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ యూనివర్సిటీల పేర్లతో రూపొందించిన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను ఉపయోగించి క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మరికొందరు ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పేర్లను ఉపయోగిస్తూ రోగులకు వైద్యం అందిస్తున్నారనే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వైద్య విద్యకు సంబంధించిన సరైన అర్హతలు లేకపోయినా అల్లోపతి వైద్యం చేస్తూ.. రోగులకు మందులు, ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్ వంటి మందులు ఇస్తున్నట్లు

## హిజాబ్ కాదు..

### యునిఫాం ముఖ్యం!.. అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు



లక్నో: హిజాబ్ ధరించటం ఇస్లామిక్ సంప్రదాయంలో విడదీయరాని భాగం కాదని అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పాఠశాల తరువాయి 2 వ పేజీలో..




## తెలంగాణలో 'టాక్సిక్' టికెట్ ధరల పెంపు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): 'టాక్సిక్' సినిమాకు టికెట్ రేట్ల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుధవారం ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా, టికెట్ రేట్ల పెంపుదలపై ఉత్తర్వులు జారీ చేసింది. చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర హోం శాఖ ఈ మేరకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన టికెట్ ధరలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని థియేటర్లలో సింగిల్ స్క్రీన్స్ సాధారణ ధరపై రూ.50 (జీఎస్టీతో కలిపి), -2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,397 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,781 |

### విశ్వవాణి



మనిషి శరీరంలో విస్తరించి ఉన్న లక్షల చెమట గ్రంథులు చెమటను విడుదల చేసి, అది ఆవిరయ్యే సమయంలో శరీరంలోని వేడిని తగ్గిస్తాయి. ఈ ప్రత్యేక శీతలీకరణ వ్యవస్థ వల్ల మనిషి వేడి వాతావరణంలోనూ ఎక్కువసేపు శారీరక శ్రమ, పరుగు వంటివి చేయగలుగుతాడు. చెమట పట్టే సామర్థ్యం మానవ పరిణామంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, ఇతర భూ క్షీరదాల కంటే ఎక్కువసేపు శారీరక శ్రమ చేయగలిగేలా చేస్తాయి.

## మోదీ 3.0 రెడీ!

### కేబినెట్ పునర్వ్యవస్థీకరణ దిశగా అడుగులు

ప్రస్తుతం ఖాళీగా 12 మంత్రి పదవులు .. కొత్త మిత్రపక్షాలు, యువ నేతలకు అవకాశం?

భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ కార్యవర్గం ఏర్పడిన నేపథ్యంలో ఇప్పుడు కేంద్ర మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణపై దృష్టి కేంద్రీకృతమైంది. పార్టీ పదవులు చేపట్టిన నేతలు, పార్లమెంట్ పదవీకాలం ముగిసిన కొందరు నేతలు కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగే అవకాశం ఉందని, వారి స్థానంలో మిత్రపక్షాలకు చెందిన నేతలు, యువ ముఖాలకు చోటు కల్పించవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



న్యూఢిల్లీ: ప్రస్తుతం ప్రధానమంత్రితో కలిపి కేంద్ర మంత్రివర్గంలో 69 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(1ఏ) ప్రకారం కేంద్ర మంత్రివర్గంలో గరిష్టంగా 81 మంది సభ్యులు ఉండవచ్చు. దీంతో ప్రస్తుతం 12 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికలు, అంతకుముందు జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గ మార్పులు చేపట్టే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. అయితే రాజకీయ సమీకరణలే కాకుండా, ఒకటి కంటే ఎక్కువ శాఖలను నిర్వహిస్తున్న కొందరు మంత్రులపై పనిభారాన్ని తగ్గించడం కూడా ఈ పునర్వ్యవస్థీకరణలో కీలక అంశంగా ఉండవచ్చని సమాచారం. ఇటీవల మూడు మార్పులు ఇప్పటికే చోటుచేసుకున్నాయి. పేపర్ లీక్‌లపై యువత ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. అలాగే మైనారిటీ తరువాయి 2 వ పేజీలో...

## 'మూసీ' భూములు తీసుకోండ్రి!



### ప్రాజెక్టు భూసేకరణ వేగవంతం చేయాలి

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భూసేకరణకు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్పష్టమైన విధానం రూపొందించాలని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్–2 కి వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని చెప్పారు. భూసేకరణ ప్రక్రియలో భూసేకరణ, ల్యాండ్ పూలింగ్, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని అన్నారు. ఇందులో న్యాయపరమైన ఎలాంటి చిక్కులు రాకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. మూసీ రివర్‌ఫ్రంట్‌లో భాగంగా చేపట్టే ప్రాజెక్టులకు అతి తక్కువ తరువాయి 2 వ పేజీలో...

## ఎల్లుండి నుంచి ఇందిరమ్మ టవర్స్ లక్కీ డ్రా

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం చేపట్టనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం 16 నియోజక వర్గాల్లో అర్హులకు ఇళ్ల కేటాయింపు కోసం లక్కీ డ్రా నిర్వహించనుంది. అయితే ఈ లక్కీ డ్రాకు మొత్తం 40,900 మందిని అర్హులుగా గుర్తించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ప్రకటించారు.

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): ఆయా ప్రాంతాల వారీగా లక్కీ డ్రా షెడ్యూల్‌ను కూడా వెల్లడించారు. సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ, కొత్త నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ - 2 వ పేజీలో...

## ఆర్మీతో టీ హబ్ ఒప్పందం

### రక్షణ స్టార్టప్‌ల టెక్నాలజీ నేరుగా సైన్యం చేతుల్లోకి



భారత రక్షణ రంగంలో స్వదేశీ టెక్నాలజీని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ టీ-హబ్.. భారత సైన్యంలోని సెంట్రల్ కమాండ్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ పార్ట్‌నర్‌షిప్ ద్వారా రక్షణ రంగంలో పనిచేస్తున్న స్టార్టప్‌లు సైన్యంతో నేరుగా కలిసి క్షేత్రస్థాయి అవసరాలపై మరింత లోతైన పరిశీలన చేసి.. పనిచేసే అవకాశం లభించనుంది.

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): ఈ ఒప్పందం ద్వారా సైన్యం ఎదుర్కొంటున్న టెక్నికల్ సమస్యలను టీ–హబ్‌కు అందజేస్తారు. వాటికి పరిష్కారాలను అభివృద్ధి చేయగల సామర్థ్యం ఉన్న స్టార్టప్‌లను టీ–హబ్ గుర్తించి ఎంపిక చేస్తుంది. ఆ తర్వాత ఆయా సంస్థలు సైనిక అధికారులతో కలిసి తమ ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, పరీక్షించడం, తరువాయి 2 వ పేజీలో...



## 'ఫైనల్'గా ఇస్తున్నరు!

### ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లులు విడుదల

### రూ.185 కోట్ల విడుదలకు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. నిధుల కొరతతో నిలిచిపోయిన నిర్మాణాలకు మళ్లీ వేగం పుంజుకునేలా ఫైనల్ బిల్లులను విడుదల చేసింది. మార్చి -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

26.8.2026

**మేషం:** ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపార విషయంలో కుటుంబ పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. ఇంటాబయట మానసిక సమస్యలు చికాకు పరుస్తాయి.

**వృషభం:** నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. పాత ఋణాలు తీర్చగలరు. వ్యాపార విస్తరణకు పెట్టుబడులు అందుతాయి. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**మిధునం:** వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. మిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు కలుగుతాయి. అనుకున్న పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఇంటాబయట నూతన సమస్యలు తప్పవు. మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి లభిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ హోదా పెరుగుతుంది. విద్యార్థుల నూతన విద్యావకాశములు లభిస్తాయి. సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

**సింహం:** ఉద్యోగస్తులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. బంధు మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. ఆర్థిక వాతావరణం ఆశించిన విధంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**కన్య:** వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధు మిత్రులతో ఊహించని కలహాలు కలుగుతాయి.

**తుల:** నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలించవు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలలో నిలకడ లోపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

**వృశ్చికం:** సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు.

**ధనస్సు:** వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు అధికారులు అనుగ్రహంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు. శుభకార్యాలకు హాజరవుతారు. ఇంటా బయట మానసిక ప్రశాంతత కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు విజయవంతంగా పూర్తి చేస్తారు.

**మకరం:** వ్యాపార ఉద్యోగాలు కొంత నిదానంగా సాగుతాయి. బంధు వర్గంతో విభేదాలు కలుగుతాయి. అనుకున్న సమయానికి డబ్బు చేతికి అందక ఇబ్బంది పడతారు. దైవ చింతన పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**కుంభం:** వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు కలిసిరావు. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. మిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. ఖర్చుల విషయంలో ఆలోచించి వ్యవహరించడం మంచిది. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు.

**మీనం:** వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. సమాజంలో పేరు కలిగిన వ్యక్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగమున నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. పాతమిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

# ప్లాన్ సక్సెస్..!?



**మొదటి పేజీ తరువాయి**

రాజకీయ పరిశీలకులు కీలకంగా చూస్తున్నారు. ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు వ్యక్తిగతంగా సమాధానం ఇవ్వకుండా, దానిని కుటుంబ రాజకీయ ప్రభావంపై ప్రశ్నగా మలచడం వెనుక ఏదైనా వ్యూహం ఉందా? అన్న సందేహం వ్యక్తమవుతోంది.

### క్రమశిక్షణ కమిటీ నిర్ణయం కీలక మలుపు

వివాదం చివరకు కాంగ్రెస్ క్రమశిక్షణ వ్యవస్థ ముందుకు వెళ్లింది. సుస్మిత వ్యాఖ్యలపై కొండా సురేఖకు షోకాజ్ నోటీసు ఇవ్వడంతో పాటు వివరణ కోరారు. సురేఖ తన కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవని, వాటికి తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వివరణ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా క్రమశిక్షణ కమిటీ సురేఖ వివరణపై సంతృప్తి చెందలేదని, ఆమెపై చర్య తీసుకోవాలని సిఫారసు చేసినట్లు సమాచారం వెలువడింది. సీఎం, ప్రభుత్వం, పార్టీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని కమిటీ అభిప్రాయపడినట్లు కూడా కథనాలు పేర్కొన్నాయి.

### లక్ష్యం ఒక్కటేనా?

ఇక్కడే అసలు రాజకీయ ప్రశ్న మొదలవుతోంది. సుస్మిత వ్యాఖ్యలు ఒకవైపు.. ఆ తర్వాత వచ్చిన రాజకీయ ప్రతిస్పందనలు మరోవైపు.. చివరకు క్రమశిక్షణ చర్యల వరకు వెళ్లిన పరిణామాలు ఇంకోవైపు. ఈ మొత్తం క్రమాన్ని కలిపి చూస్తే కొండా కుటుంబంపై రాజకీయ ఒత్తిడి పెరిగిందన్న అభిప్రాయం బలపడుతోంది. ఇది యాదృచ్ఛిక పరిణామాల సమాహారమా? లేక కొండా కుటుంబ రాజకీయ ప్రభావాన్ని తగ్గించేందుకు కాంగ్రెస్‌లోని ఒక వర్గం పద్ధతిగా వ్యవహరించిందా? అన్నదే ఇప్పుడు ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కొండా కుటుంబానికి పరకాలతో ఉన్న రాజకీయ అనుబంధం, అక్కడి రాజకీయ సమీకరణాలు, ప్రస్తుత ఎమ్మెల్యేతో ఏర్పడిన విభేదాలు ఈ మొత్తం వ్యవహారానికి ప్రత్యేక ప్రాధాన్యాన్ని తెచ్చాయి. అందుకే పరకాల పరిణామాలను కొందరు నేతలు కేవలం స్థానిక రాజకీయ పోటీగా కాకుండా.. ఉమ్మడి వరంగల్‌లో కొండా కుటుంబ రాజకీయ ప్రాబల్యాన్ని పునర్నిర్వచించే ప్రయత్నంగా చూస్తున్నారు. దీంతో కొండా ఫ్యామిలీ వర్సెస్ కాంగ్రెస్‌లోని మరో వర్గం అనే చర్చ ఇప్పుడు బహిరంగ రాజకీయ చర్చగా మారింది. క్రమశిక్షణ కమిటీ సిఫారసుతో ఈ వివాదం మరింత తీవ్రమైంది. కొండా కుటుంబాన్ని రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నం నిజంగానే జరిగిందా? లేక సుస్మిత వ్యాఖ్యలతో మొదలైన వివాదం సహజంగానే ఈ స్థాయికి చేరిందా? దీనికి సమాధానం రాబోయే రోజుల్లో కాంగ్రెస్ తీసుకునే తదుపరి నిర్ణయాలు, ఉమ్మడి వరంగల్‌లో మారే రాజకీయ సమీకరణాలే ఇవ్వాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ఆర్మీతో టీ హబ్ ఒప్పందం

**మొదటి పేజీ తరువాయి**

ధ్రువీకరించడం, అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయడం వంటి ప్రక్రియలను చేపడతాయి. దీంతో కొత్త కొత్త ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలో ఉపయోగించగల పరిష్కారాలుగా మార్చేందుకు మార్గం సుగమం కానుంది. ఈ ఒప్పందం అమలును పర్యవేక్షించేందుకు టీ-హబ్, ఆర్మీ ప్రతినిధులతో కూడిన జాయింట్ ఓవర్‌సైట్ కమిటీ పనిచేయనుంది. స్టార్టప్‌లు, సైనిక భాగస్వాముల మధ్య సమన్వయం, ఉత్పత్తి అభివృద్ధి, టెస్టింగ్, ఆపరేషనల్ ఫీడ్‌బ్యాక్ వంటి అంశాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.



సైన్యం నుంచి వచ్చే సమస్యలను కేవలం గుర్తించడమే కాకుండా.. వాటికి ఉపయోగపడే టెక్నికల్ పరిష్కారాలను అభివృద్ధి చేసి.. అవసరమైతే వాటిని ఉపయోగంలోకి తీసుకురావడమే ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. టీ-హబ్‌కు భారత సైన్యంతో భాగస్వామ్యం ఇదే తొలిసారి కాదు. ఇప్పటికే వెస్ట్రన్ కమాండ్‌తో భాగస్వామ్యం కొనసాగుతోంది. తాజా ఒప్పందంతో కమాండ్ స్థాయిలో భారత సైన్యంతో ప్రత్యక్షంగా పనిచేస్తున్న ఎంపిక చేసిన సంస్థల్లో టీ-హబ్ ఒకటిగా నిలిచింది. రక్షణ రంగ స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో టీ-హబ్ ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తోంది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఐడెక్స్ పథకాన్ని అమలు చేస్తున్న 28 సంస్థల్లో టీ-హబ్ ఒకటి కావడం గమనార్హం. దేశంలోనే అతిపెద్ద ఐడెక్స్ ఇంక్యుబేటర్‌గా టీ-హబ్ కొనసాగుతోంది. ఇప్పటివరకు 100కు పైగా రక్షణ స్టార్టప్‌లతో కలిసి పనిచేసిన టీ-హబ్.. 70కి పైగా రక్షణ సవాళ్లను నిర్వహించినట్లు తెలిపింది. తన సహకారంతో స్టార్టప్‌లు రూ.4.2 కోట్లకు పైగా గ్రాంట్లు.. రూ.9 కోట్ల విలువైన ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్ ప్రాజెక్టులను పొందాయని పేర్కొంది. అంతేకాకుండా రూ.250 కోట్లకు పైగా విలువైన వాణిజ్య రక్షణ ఆర్డర్లను సాధించినట్లు టీ-హబ్ వెల్లడించింది.

# 'ఫైనల్'గా ఇస్తున్నరు!

**మొదటి పేజీ తరువాయి**

నెల వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న దాదాపు 16,000 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా మొత్తం రూ.185 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటా నిధులు సకాలంలో రాకపోవడంతో బిల్లుల చెల్లింపు ఆలస్యమైంది. అయితే, లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కేంద్ర నిధుల కోసం వేచి చూడకుండా, రాష్ట్ర ప్రభుత్వమే తమ సొంత నిధుల నుంచి రూ.185 కోట్లను సర్దుబాటు చేసి విడుదల చేసింది. విడుదల చేసిన ఈ నిధులను శుక్రవారం లబ్ధిదారుల యొక్క బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. చివరి విడత బకాయిల కింద ఒక్కో లబ్ధిదారునికి రూ.1 లక్ష చొప్పున డీబీటీ ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకే చేరుతుంది.

# హిజాబ్ కాదు..

**మొదటి పేజీ తరువాయి**

యూనిఫాంతోపాటు అదనంగా హిజాబ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఓ విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపి ఈ తీర్పును వెలువరించింది. వ్యక్తిగత ఇష్టాయిష్టాల కంటే పాఠశాల నిబంధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది. క్రమశిక్షణ, సమానత్వాన్ని కాపాడేందుకు పాఠశాలలు అమలు చేసే నియమ నిబంధనలే ఆమోద యోగ్యమని పేర్కొంది. ప్రయాగ్‌రాజ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన మైనర్ విద్యార్థిని అదే సంస్థలో 11వ తరగతిలో ప్రవేశం పొందడానికి సిద్ధమైంది. ఈ క్రమంలోనే తన పాఠశాల యూనిఫాంతో పాటు హిజాబ్ ధరించేందుకు యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ ఆమె తన తల్లి ద్వారా హైకోర్టును ఆశ్రయించింది. 6వ తరగతి నుంచి తాను ఆ పాఠశాలలోనే చదువుకుంటూ హిజాబ్ ధరిస్తున్నానని, ఇస్లామిక్ సంప్రదాయం ప్రకారం హిజాబ్ ధరించడం మతపరమైన ఆచారంలో తప్పనిసరి అని తన పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ ఇంద్రజిత్ శుక్లాలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ సమర్పించిన వివిధ తరగతుల ఫోటోలను పరిశీలించిన ధర్మాసనం.. సదరు విద్యార్థిని మినహా అదే మతానికి చెందిన ఇతర బాలికలు ఎవరూ హిజాబ్ ధరించకపోవడాన్ని గుర్తించింది.

# మోదీ 3.0 రెడీ!

**మొదటి పేజీ తరువాయి**

వ్యవహారాల సహాయ మంత్రి జార్జ్ కురియన్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ రాజ్యసభ సభ్యత్వ పదవీకాలం ముగియడంతో రాజీనామా చేశారు. తదుపరి పార్టీ సంస్థాగత బాధ్యతలు చేపట్టిన కొందరు మంత్రులపై దృష్టి పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవల కేంద్ర సహాయ మంత్రులు హర్ష్ మల్హోత్రా, పంకజ్ చౌదరి వరుసగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో పార్టీ కేంద్ర నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించగా, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు పార్టీ కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. మరోవైపు కొందరు మంత్రుల రాజ్యసభ పదవీకాలం కూడా ముగియనుంది. పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి, సామాజిక న్యాయం శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ ప్రస్తుత రాజ్యసభ పదవీకాలం నవంబర్‌లో ముగియనుంది. పనితీరు ఆధారంగా కూడా కొందరు మంత్రులను మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై వస్తున్న ఊహాగానాలపై బీజేపీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. బీజేపీలో సాధారణంగా 'ఒక వ్యక్తి-ఒక బాధ్యత' విధానాన్ని అనుసరిస్తారు. మంత్రివర్గంలో చోటు దక్కవచ్చని ప్రచారం జరిగిన పలువురు నేతలకు ఇప్పటికే పార్టీ సంస్థాగత బాధ్యతలు అప్పగించారు. స్మృతి ఇరానీ, వినోద్ తావ్డే, సతీశ్ పూనియా, తరుణ్ చుగ్ తదితరులు ఇందులో ఉన్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో వయస్సు కూడా ఒక అంశంగా పరిగణించే అవకాశం ఉందని సమాచారం. 2024లో మోదీ 3.0 ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన సమయంలో మంత్రివర్గంలో 65 శాతం మందికి పైగా మంత్రుల వయస్సు 51 నుంచి 70 ఏళ్ల మధ్య ఉండగా, 24 శాతం మంది 31 నుంచి 50 ఏళ్ల వయస్సు గలవారు. ప్రస్తుతం కనీసం 12 మంది కేబినెట్ మంత్రులు, స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రుల వయస్సు 70 ఏళ్లు దాటింది. బీహార్‌కు చెందిన మిత్రపక్షం హిందుస్తానీ అవామ్ మోర్చా (హామ్) నేత జితన్ రామ్ మాంఝీ 81 ఏళ్ల వయస్సుతో మంత్రివర్గంలో అత్యంత వృద్ధ కేబినెట్ మంత్రి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మిత్రపక్షం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నేత కింజరాపు రామ్మోహన్ నాయుడు 38 ఏళ్ల వయస్సుతో ప్రస్తుతం అతి పిన్న వయస్కుడైన మంత్రి. మంత్రివర్గంలో యువత, మహిళలకు ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.

## 11 మంది శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లు!

**మొదటి పేజీ తరువాయి**

అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో 11 మంది నకిలీ డాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ సర్టిఫికెట్లు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లు, అనుమతి లేని మందులు, వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఎక్కడెక్కడ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు.. నకిలీ సర్టిఫికెట్లను ఎక్కడి నుంచి పొందారు.. ఎంతకాలంగా ఇలా నకిలీ డాక్టర్లు వైద్యం చేస్తున్నారు.. ఎంతమంది రోగులకు చికిత్స అందించారు అనే అంశాలపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా.. నకిలీ విద్యా సర్టిఫికెట్లను తయారు చేసి సరఫరా చేస్తున్న ముఠా ఏదైనా ఉందా అనే కోణంలోనూ విచారణ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక.. భారీగా నకిలీ వైద్యుల బాగోతం బయటికి రావడంతో నగర ప్రజలకు పోలీసులు పలు కీలక సూచనలు చేశారు.

# ప్యాకేజ్డ్ ఫుడ్ విషమే.. కానీ!

**మొదటి పేజీ తరువాయి**

జరిగిన సమావేశంలో, కోకా కోలా వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు రంగుల హెచ్చరిక లేబుళ్ల విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ లేబుళ్లు గందరగోళానికి దారితీస్తాయని, వాటివల్ల ఆహారపు అలవాట్లలో ఎటువంటి మార్పు రాదని వారు వాదించారు. కేవలం చిహ్నాలను చూసి ప్రజల ఆహార అలవాట్లు మారతాయని భావించడం సరైంది కాదని కోకా కోలా ఇండియాకు చెందిన ఒక ఉన్నతాధికారి వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ, 'కలర్' హెచ్చరికల ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. వాటి స్థానంలో కేవలం చక్కెర, కొవ్వు, ఉప్పు శాతాలను తెలిపే నలుపు-తెలుపు పట్టికను ప్యాకెట్ల ముందు భాగంలో ఉంచాలని ప్రతిపాదించింది. ఈ విషయాన్ని ఆగస్టులో సుప్రీంకోర్టుకు విన్నవించింది. అయితే, ఈ నిర్ణయంపై ప్రజారోగ్య కార్యకర్తలు దాఖలు చేసిన పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు, ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. "భారతీయుల ఆరోగ్యం పట్ల దేశానికి శ్రద్ధ ఉందనే విషయం ప్రపంచానికి తెలియాలి" అని ఈ సందర్భంగా న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఐరోపా, బ్రిటన్ వంటి దేశాల్లో కోకా కోలా, నెస్లే వంటి కంపెనీలు స్వచ్ఛందంగా స్పష్టమైన ట్రాఫిక్ లైట్ లేబుళ్లను ఉపయోగిస్తున్నాయి. కానీ, భారత్‌లో మాత్రం ఆ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అంతేకాకుండా, విదేశాల్లో విక్రయించే ఉత్పత్తులతో పోలిస్తే, భారత్‌లో అమ్మే ఫాంటా వంటి పానీయాల్లో చక్కెర శాతం ఎక్కువగా ఉండటం, కిట్‌క్యాట్, మ్యాగీ వంటి ఉత్పత్తుల నాణ్యతలో వ్యత్యాసాలు ఉండటం గమనార్హం.

# ఉల్లి ఘాటు

**మొదటి పేజీ తరువాయి**

ఎక్స్‌ప్రెస్ రైలును అనేక ప్రాంతాలకు పంపిస్తోంది. ఈ రైలు నిండా ఉల్లి నిల్వలున్నాయి. మొట్టమొదటగా ఈ రైలు ఢిల్లీ చేరుకుంది. ఈ రైలులో 800 మెట్రిక్ టన్నుల ఉల్లి నిల్వలున్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఉల్లి నిల్వలతో కూడిన రైళ్లను పంపిస్తారు. గత నెల రోజులుగా మార్కెట్‌లోకి ఉల్లి సరఫరా బాగా తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. ఉల్లి ధరలు పెరగడానికి కారణం ప్రస్తుత ఖరీఫ్ పంట ఆలస్యం కావడమే. ఇప్పుడు మార్కెట్లో ఉన్న ఉల్లి రబీ పంట ద్వారా వచ్చింది. ఈ పంట నిల్వలు ఇప్పుడు పూర్తవుతున్నాయి. అయితే, ఖరీఫ్ ఆలస్యం కావడం వల్ల ఉల్లి దిగుబడి ఇంకా రాలేదు. దీంతో ధరలు పెరుగుతున్నాయి. సెప్టెంబర్‌తోపాటు అక్టోబర్‌లో కూడా ఉల్లి ధరల పెరుగుదల ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో ఉల్లి కిలో ధర సగటున రూ.42 వరకు పలుకుతోంది. ఢిల్లీలాంటి చోట్ల రూ.65-రూ.70 వరకు ఉంటోంది.

# చక్కెర తీపి

**మొదటి పేజీ తరువాయి**

2025-26 సీజన్‌లో దేశీయ చక్కెర ఉత్పత్తి గతంలో అంచనా వేసిన 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు తగ్గుతుందని అంచనా. అయినప్పటికీ దేశీయ వార్షిక డిమాండ్ 280-285 లక్షల టన్నులుగా ఉండటంతో చక్కెర నిల్వలు సరిపడా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. ధరల నియంత్రణలో భాగంగా కేంద్రం ఇటీవల 10 లక్షల టన్నుల ముడి చక్కెర దిగుమతులకు అనుమతి, భారీ వినియోగదారులపై స్టాక్ పరిమితులు విధించింది. నిల్వలు దాచడం, ఊహాగానాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్రాలు తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించింది. కాగా, ధరల తగ్గుదల పూర్తిస్థాయిలో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లకు చేరలేదు.

## తెలంగాణలో 'టాక్సిక్' టికెట్ ధరల పెంపు

**మొదటి పేజీ తరువాయి**

మల్టీప్లెక్సులు/స్పెషల్ థియేటర్లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈ పెంచిన ధరలు 26వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ 10 రోజుల పాటు రోజుకు 5 షోలకు వర్తిస్తాయని పేర్కొన్నది. టిక్కెట్ల పెంపునకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో సినీ కార్మికుల సంక్షేమానికి రూ.కోటిని తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలోని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కమిటీ ఖాతాలో డిపాజిట్ చేయాలని నిబంధన విధించింది.

## 'మూసీ' భూములు తీసుకోండ్రి!

**మొదటి పేజీ తరువాయి**

వడ్డీకి రుణ సదుపాయాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని, అలాగే టీడీఆర్‌లు జారీ చేసే విషయంలో కూడా ప్రతి వారం సమీక్షించాలని చెప్పారు. గండిపేట మంచిరేవుల సమీపంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తక్షణం టెండర్లు పిలవాలని ఆదేశించారు. అలాగే, కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. మూసీ పునరుజ్జీవనం.. హైదరాబాద్ భవిష్యత్తుకు కీలకమైన ప్రాజెక్టు అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ, జేఎండీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎల్లుండి నుంచి ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా

**మొదటి పేజీ తరువాయి**

సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తిచేశామని వెల్లడించారు. క్యూఆర్ పరిధిలోని తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని గుర్తుచేశారు. ఇందుకోసం ఆగస్టు 15 తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించామని చెప్పారు. మొత్తం 60,720 దరఖాస్తులు అందాయని, వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర విచారణ అనంతరం 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక ఫంక్షన్ హాళ్లలో ప్రజలు, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించామని చెప్పారు. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ. 10,000 ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 15 వరకు అక్రెడిటేషన్ కార్డుల పొడిగింపు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు) : రాష్ట్రంలో కొత్త అక్రెడిటేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వరింగ్ జర్నలిస్టులకు హైకోర్టు ఊరట కల్పించింది. వారి వద్ద ఉన్న పాత కార్డుల గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కొత్తగా అక్రెడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారితోపాటు గతంలో కార్డులు లేనివారి కోసం ప్రస్తుతానికి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 15కు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

## జూబ్లీహిల్స్ సీఐపై వేటు

**కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసులో కీలక పరిణామం**

**ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం వల్లే సస్పెండ్**



జూబ్లీహిల్స్-హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) ఎన్. సుమంత్‌కు సంబంధించిన కేసులో జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ) ముత్తు యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును పోలీసులు చేపట్టిన చేసిన తీరుపై విచారణకు కూడా ఆదేశించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుమంత్ ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) నమోదు చేయడంలో జాప్యం జరిగిందని, నిందితుడిని పట్టుకోవడంలో సీఐ విఫలమయ్యారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సుమంత్ డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## టీబీజేపీ చీఫ్ దీక్ష విరమణ

**ఆరోగ్యం క్షీణించడంతో నిర్ణయం**

**ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 48 గంటల దీక్షకు పిలుపు**

**రక్తపోటు పడిపోవడంతో రెండో రోజే దీక్ష ముగింపు**

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రెండో రోజే విరమించారు. దీక్షలో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, పార్టీ సీనియర్ నేతల సూచన మేరకు మంగళవారం దీక్షను ముగించారు. సోమవారం ప్రారంభమైన ఈ దీక్షలో రాంచందర్ రావు ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. ఆయన రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీంతో, సీనియర్ నేతలు దీక్షను విరమించాలని ఆయనకు సూచించారు. అనంతరం, పార్టీ సీనియర్ నేత, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్.. రాంచందర్ రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అంతకుముందు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు దీక్షా శిబిరానికి వచ్చి రాంచందర్ రావుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు.



## గచ్చిబౌలిలో భారీగా నిర్మాణాల కూల్చివేత

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రక్రియ మంగళవారం కూడా కొనసాగింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా ఈ కూల్చివేతలను చేపట్టారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం రెండు భవనాలను పూర్తిగా నేలమట్టం చేశారు. వీటితో పాటు మరో ఆరంతస్తుల భవనం కూల్చివేత పనులు సైతం కొనసాగుతున్నాయి. భారీ యంత్రాల సాయంతో అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తుండగా, ఆ ప్రాంతంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. గత శనివారం అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం విదితమే. ఈ విషాదకర ఘటన నేపథ్యంలో అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ప్రమాదకరంగా ఉన్న ఇతర అక్రమ కట్టడాలను, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలను గుర్తించి వాటిని తొలగిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నివారించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

# తప్పు ప్రభుత్వానిది.. శిక్ష ప్రజలకు

**22ఏ బాధితుల సమావేశంలో హరీశ్ రావు**




హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. “భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?” అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## జీవో 77 ఏకపక్షం జీవోను సవరించాలి

**సీఎంకు థియేటర్ల యజమానుల లేఖ**



హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): తెలంగాణలో సినిమా టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 77పై వివాదం ముదురుతోంది. ఈ జీవో ఏకపక్షంగా ఉందని, కేవలం నిర్మాతలకు మేలు చేసేలా రూపొందించారని ఆరోపిస్తూ తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసింది. స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి కీలక భాగస్వామ్య పక్షాలను సంప్రదించకుండా, కేవలం తెలుగు యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ ధరల పెంపు వల్ల ఎగ్జిబిటర్లకు ఎటువంటి లాభం లేదని, థియేటర్ల నిర్వహణ, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి ఆర్థిక భారాలన్నింటినీ తామే భరిస్తున్నామని వారు స్పష్టం చేశారు. కరోనా అనంతర కాలంలో ప్రేక్షకులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు గత మూడేళ్లలో సుమారు రూ. 300 కోట్లు వెచ్చించి థియేటర్లను ఆధునికీకరించామని, అయితే ప్రస్తుత నిబంధనల వల్ల టికెట్ ధరలను నిర్ణయించే హక్కును కూడా కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నూతన నిబంధనల ప్రకారం టైర్-2, టైర్-3 పట్టణాల్లోని ఎయిర్-కూల్డ్ థియేటర్లను ఏసీ థియేటర్లుగా మార్చాలంటే ఒక్కో స్క్రీన్‌కు సుమారు రూ. 60 నుండి 80 లక్షల వరకు వ్యయమవుతుందని, ఈ ఆర్థిక భారాన్ని భరించలేక ఇప్పటికే అనేక థియేటర్లు మూతపడ్డాయని వారు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండగా, వాటిపై సుమారు 20,000 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ జీవో అమలులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని థియేటర్లు మూతపడి, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, చిత్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచే ఎగ్జిబిటర్ల ప్రయోజనాలను కాపాడే విధంగా జీవో 77ను పునఃసమీక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఆయన చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

# ఫీజులు ఇవ్వరు.. విదేశీ విద్య ఇస్తరా?

**ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్**



హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న విద్యా సంస్థలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని... అలాంటప్పుడు విదేశీ విద్యను అందిస్తామని, ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రాష్ట్రానికి రప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఫీజు బకాయిలు అందకపోవడంతో రాష్ట్రంలో అనేక కళాశాలలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని బండి సంజయ్ తెలిపారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని, అయినా సీఎంకు పట్టకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. బకాయిలు అడిగిన కళాశాల యాజమాన్యాలను బెదిరించడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఈ రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడం వల్ల ముఖ్యంగా దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేసారి (వన్ టైం సెటిల్‌మెంట్) బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. హామీలు ఇచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోతోందని విమర్శించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో తలెత్తే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## రేవంత్ ప్రెస్‌మీట్ మంత్రులకే తెల్వదు: ఆర్ఎస్పీ

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీవ్ర అస్తవ్యస్తంగా ఉందనడానికి కేబినెట్‌లోని మంత్రుల మధ్య సయోధ్య లేకపోవడమే నిదర్శనమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా లండన్ పర్యటన నుంచి వచ్చి, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంపై అత్యవసర ప్రెస్‌మీట్ ఏర్పాటు చేస్తే... ఆయన పక్కన ఉండాల్సిన కేబినెట్ మంత్రులకు ఆ సమావేశం గురించిన సమాచారం కూడా లేకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. ఒకే సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క మీడియా సమావేశం ముగించిన కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్ పెట్టినప్పటికీ, ఆయన సహచర మంత్రులెవరూ ఆ భేటీకి హాజరుకాకపోవడాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎత్తిచూపారు. రాష్ట్రంలో పాలనా యంత్రాంగం ఎలా ఉందో చెప్పడానికి ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని, ఒక ముఖ్యమైన అంశంపై నిర్ణయం తీసుకునే విషయంలో స్వయంగా కేబినెట్‌లోని మంత్రుల మధ్యే సయోధ్య, కనీస సమాచారం లేని పరిస్థితి నేడు తెలంగాణలో నెలకొందని ఆయన విమర్శించారు.

## ఏపీలో సమ్మె విరమించిన జూడాలు

విజయవాడ, ఆగస్టు 25 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న జూనియర్ వైద్యుల (జూడా) సమ్మెకు తెరపడింది. తమ సమ్మెను విరమిస్తున్నట్లు జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు హైకోర్టుకు స్వయంగా నివేదించారు. జూనియర్ వైద్యుల సమ్మెపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా, విధుల్లోకి చేరుతున్నామని చెబుతూనే సమ్మెను విరమిస్తున్నట్లు జూడాలు న్యాయస్థానానికి స్పష్టం చేశారు. అదే సమయంలో, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. జూనియర్ వైద్యులు లేవనెత్తిన డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు, వారి సమస్యల పరిష్కారంపై రెండు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఇచ్చిన ఈ స్పష్టమైన ఆదేశాలతో జూనియర్ వైద్యులు తమ నిరసనను ఉపసంహరించుకోవడంతో, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి.

## అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు

**రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్**



న్యూఢిల్లీ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సీఎం చేసిన ఆరోపణలు అర్థరహితమని మండిపడ్డారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కేంద్రం అనుమతి రాకముందే రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్ సహా ఇతర దేశాలకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈసారి మాత్రం స్పష్టమైన పరిపాలనా కారణాలతో విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ముఖ్యమంత్రి ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాలతో దేశానికి ఏమైనా ప్రయోజనం ఉందా? అనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు. అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి అర్హత లేని వ్యక్తులను కలవాలని నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించే, భారత్‌పై విమర్శలు చేసే వ్యక్తితో సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ కాదా? అని నిలదీశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు విధించిన వ్యక్తితో సీఎం భేటీ కావడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన హోదాకు తగిన వ్యక్తులతోనే చర్చలు జరపాలని కిషన్‌రెడ్డి సూచించారు. సీఎం స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడుల కోసం అధికారుల బృందాన్ని పంపినా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని కూడా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## అర్వింద్‌పై నిఘా పెట్టలేదు: డీజీపీ



హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తనపై పోలీసు నిఘా ఉంచారని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన సంచలన ఆరోపణలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తోసిపుచ్చారు. రేవంత్ సోదరుడి సూచనల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు ఒక ఏసీపీ స్థాయి పోలీసు అధికారిని నియమించారంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎక్స్ వేదికగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి సంచలన పోస్ట్ చేశారు. తెలంగాణ పోలీసు యంత్రాంగం భారత రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార పరిధికి కట్టుబడి పనిచేస్తోందా లేక సీఎం కుటుంబ సభ్యుల ఆదేశాలతో నడుస్తోందా అని ఆయన తన ట్వీట్‌లో ప్రశ్నించారు. ఎంపీ పోస్టుపై వెంటనే స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, సంబంధిత అధికారులతో సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ధ్రువీకరించుకున్నామని తెలిపారు. ఎంపీని అనుసరించడానికి గానీ, ఆయనపై నిఘా ఉంచడానికి గానీ ఏ అధికారిని నియమించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు శాఖ ఇటువంటి నిఘా పద్ధతులను ఎన్నడూ అనుసరించదని, కేవలం రాజ్యాంగబద్ధమైన విధులకు మాత్రమే కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. అయినప్పటికీ, ఈ వ్యవహారానికి సంబంధించి ఎంపీ వద్ద ఏవైనా నిర్దిష్టమైన ఆధారాలు లేదా సమాచారం ఉంటే నేరుగా తనకు వ్యక్తిగతంగా అందజేయవచ్చుని, వాటి ఆధారంగా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపిస్తానని డీజీపీ హామీ ఇచ్చారు. డీజీపీ ఇచ్చిన ఈ వివరణతో ఎంపీ వర్సెస్ పోలీసు నిఘా వివాదంలో చెలరేగిన రాజకీయ దుమారానికి తెరదించే ప్రయత్నం చేశారు.

## రేవంత్ రెడ్డితో దేశ భద్రతకు ముప్పు: అర్వింద్

హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారుతోందని ఆరోపించారు. విదేశీ పర్యటనల్లో రేవంత్ రెడ్డి దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతున్నారని అర్వింద్ విమర్శించారు. విదేశాల్లో దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడటం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని, ఇకపై ఆయన ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వ్యాఖ్యానించారు. మరోవైపు రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కూడా అర్వింద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బకాయిలను క్లియర్ చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలను పట్టించుకోకుండా విదేశాల నుంచి కొత్త విద్యాసంస్థలను తీసుకొస్తామని చెప్పడం ఏంటని అర్వింద్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు.



## అక్రమాలకు అడ్డుకట్టకే డిజిటల్ రేషన్ కార్డులు

ధర్మపురి, ఆగస్టు 25 (ఈవార్తలు): ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నకిలీ, డూప్లికేట్ రేషన్ కార్డులను తొలగించి అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా స్మార్ట్ కార్డుల విధానాన్ని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందేలా పోర్టబిలిటీ సౌకర్యం కల్పించామని, పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ధర్మపురి నియోజకవర్గంలో 80,873 స్మార్ట్ రేషన్ కార్డులు, గొల్లపల్లి మండలంలో 15,185 కుటుంబాలకు కార్డులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల చేర్పు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతలో అర్హులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించామని, త్వరలో రెండో విడత ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన వారికి కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డీఎస్ఓ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ మాజీద్, ఏఎంసీ చైర్మన్ సంతోష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ప్రభుత్వ ఆస్తులు కాపాడాలి

**10 నెలలుగా హామీలే తప్ప.. చర్యలు శూన్యం**

**సీఎం ప్రజావాణిలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఫిర్యాదు**



జగిత్యాల/హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 138లో ఉన్న 20 గుంటల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 138లోని ప్రభుత్వ భూమికి ఎలాంటి యాజమాన్య హక్కులు లేకపోయినా, కొందరు మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై తప్పుడు అనుమతులు పొందినట్లు జీవన్‌రెడ్డి ఆరోపించారు. వాటి ఆధారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో ముఖ్యమంత్రితో పాటు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌కు లేఖలు రాశామని తెలిపారు. న్యాయ సలహాలు తీసుకుని చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలు యథావిధిగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు తక్షణమే చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని, ఇందుకు బాధ్యులైన అధికారులు, నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి తన వినతిపత్రంలో కోరారు.



## జగిత్యాల స్కంద ఆస్పత్రికి ఫైన్

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం.. రూ.10 వేల జరిమానా**

జగిత్యాల, ఆగస్టు 25 (ఈవార్తలు): జగిత్యాల బైపాస్ రోడ్డులోని మోతె డౌన్ చౌరస్తా సమీపంలో కెనాల్‌పై స్కంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన బయోమెడికల్ వ్యర్థాలు పడేసినట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదకరమైన బయోహజార్డ్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశంలో పడేయడంపై మున్సిపల్ అధికారులు ఆస్పత్రికి రూ.10 వేల జరిమానా విధించారు. బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణం

విజయవాడ, ఆగస్టు 25 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇన్స్పైర్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

**విద్యార్థుల సందడితో 'ఎంబార్క్-2కె26'**



హనుమకొండ, ఆగస్టు 25 (ఈవార్తలు): ఎర్రగట్టుగుట్ట పరిధిలోని ఇన్స్పైర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. హనుమకొండలోని ఎన్టీఆర్ ఫంక్షన్ హాల్‌లో 'ఎంబార్క్-2కె26' పేరుతో జరిగిన కార్యక్రమంలో జూనియర్లు, సీనియర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రోత్సహించడమే ఫ్రెషర్స్ డే ఉద్దేశమని కళాశాల యాజమాన్యం తెలిపింది. నూతన విద్యార్థులకు సీనియర్లు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమానికి హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, మేర కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకటరాజం, పర్వతగిరి సీఐ రాజగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో కీలక దశ అని, సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఇన్స్పైర్ జూనియర్ కళాశాల చైర్మన్ తీగల భరత్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన దిశలో ముందుకు సాగాలని సూచించారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కూడా కళాశాల ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వివిధ పోటీ పరీక్షల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. వారి విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మిగతా విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని నిర్వాహకులు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి శ్రీరామ్‌రెడ్డి, డైరెక్టర్లు తీగల రాజ్‌కుమార్, కోటిచింతల మమతకుమారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జూనియర్లు, సీనియర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో 'ఎంబార్క్--2కె26' వేడుకలు సందడిగా సాగాయి.

# డ్రగ్స్‌పై పోరులో ప్రజల భాగస్వామ్యం కీలకం

**'నషా ముక్త్ భారత్ అభియాన్'పై మీడియా వర్క్‌షాప్**



మహేశ్వరం, ఆగస్టు 25 (పీఐబీ): మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'పై పత్రికా సమాచార కార్యాలయం–హైదరాబాద్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మీడియా ప్రతినిధులకు 'వార్త' మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈగల్ ఫోర్స్ ఎస్పీ రావుల గిరిధర్, పీఐబీ–హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, ఎంపీడీవో ఎన్. శారదమ్మ పాల్గొన్నారు. డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు చట్టపరమైన చర్యలు మాత్రమే సరిపోవని, ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక బలగాలతో పాటు స్థానిక పోలీసు యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందన్నారు. డ్రగ్స్ నివారణ ఇళ్లు, పాఠశాలల నుంచే ప్రారంభం కావాలని సూచించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, స్నేహితులు అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ధ్రువీకృత సమాచారాన్ని అందించడం ద్వారా డ్రగ్స్ దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈగల్ ఫోర్స్ ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత, కుటుంబ సమస్య స్థాయిని దాటి సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా మారిందన్నారు. జనవరి నుంచి తెలంగాణలో దాదాపు 8 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుమారు 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికిపైగా పోలీసు, ఇతర శాఖల సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన కథనాలను ప్రచురించేటప్పుడు మీడియా కచ్చితత్వం, సున్నితత్వం పాటించాలని సూచించారు. ముఖ్యంగా మైనర్ల వివరాలు, బాధితుల వ్యక్తిగత సమాచారాన్ని అనవసరంగా బహిర్గతం చేయవద్దన్నారు. పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన రిపోర్టింగ్‌కు జర్నలిస్టులను సన్నద్ధం చేయడమే వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. పీఐబీ మీడియా, కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. మహేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దర్యాప్తులకు గ్రామస్తుల సహకారం

**గ్రామస్తులను అభినందించిన జగిత్యాల ఎస్పీ**



జగిత్యాల రూరల్, ఆగస్టు 25 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో జరిగిన వృద్ధురాలి మృతి కేసును కేవలం నాలుగు గంటల్లో ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు, దర్యాప్తులో సహకరించిన గ్రామస్తులను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. తిమ్మాపూర్‌కు చెందిన దోమల రవి, దోమల గంగాధర్ అందించిన కీలక ఆధారాలను గుర్తించి వారికి జిల్లా పోలీసు కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల ఛేదనలో ప్రజల సహకారం ఎంతో కీలకమన్నారు. అనుమానాస్పద సంఘటనలు గమనించినా, నేరానికి సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కేసులో గ్రామస్తులు అందించిన బైక్‌కు సంబంధించిన ఫొటోలు దర్యాప్తులో కీలక ఆధారాలుగా మారాయని తెలిపారు. ప్రజలు పోలీసులతో సమన్వయంతో వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు. కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ ఉమాసాగర్, సిబ్బందిని కూడా అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బల్వంతాపూర్ అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

మల్యాల, ఆగస్టు 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామంలోని నూతన అంబేడ్కర్ సంఘం 2026–27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నక్క శ్రీనివాస్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా తైదల వంశీ, క్యాషియర్‌గా చిర్ర అనిల్, రైటర్‌గా గాలిపెల్లి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా ఉండేటి శ్రీకాంత్ ఎంపికయ్యారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.



## అభివృద్ధి చేతకాకే బీఆర్ఎస్‌పై అబద్ధాలు

**కుడి కాల్వ పనులు 98% బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి: నవీన్‌రావు**

గంగాధర, ఆగస్టు 25 (ఈవార్తలు): నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ పనులను బీఆర్ఎస్ అడ్డుకుంటోందంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు ఖండించారు. మధురానగర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుడి కాల్వకు సంబంధించిన 17 కిలోమీటర్ల పనుల్లో 98 శాతం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన స్వల్ప పనులు పూర్తి చేస్తే పలు గ్రామాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా పనుల్లో కనీస పురోగతి లేదని విమర్శించారు. అభివృద్ధి పనులు చేపట్టకుండా బీఆర్ఎస్‌పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రజలు, రైతుల సమస్యలపై ప్రతిపక్షంగా నిరంతరం ప్రశ్నిస్తూ పోరాడతామని నవీన్‌రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ఆశా వర్కర్లకు అండగా ఉంటాం

**కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

కోరుట్ల/హైదరాబాద్, ఆగస్టు 25 (ఈవార్తలు): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని మెడికల్ కౌన్సిల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ సంఘీభావం తెలిపారు. ఆశా వర్కర్లతో కలిసి ధర్నాలో పాల్గొని వారి డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదన్నారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆశా వర్కర్ల హక్కుల పరిరక్షణతో పాటు వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్ హామీ ఇచ్చారు.



## హరిత గ్రామాలే లక్ష్యంగా వన మహోత్సవం

**గంగాధర ఎంపీడీవో దమ్మని రాము**

గంగాధర, ఆగస్టు 25 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని చర్లపల్లి (ఆర్) గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ ఎట్టెపు కనుకయ్యతో కలిసి ఎంపీడీవో దమ్మని రాము మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దమ్మని రాము మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించవచ్చని తెలిపారు. హరితహారంలో భాగంగా గ్రామాన్ని పచ్చదనంతో, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేరెళ్ల అయిలయ్య, ఆర్ఐ రాజు, సర్వేయర్ కుమార్, జేసీ సత్యప్రకాష్, టీఏ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి శేఖర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారం మోడల్ స్కూల్‌లో సైన్స్ ఇన్నోవేషన్ హబ్



ధర్మారం, ఆగస్టు 25 (ఈవార్తలు): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, నూతన ఆలోచనలను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ మోడల్ స్కూల్ ధర్మారంలో 'సైన్స్ ఇన్నోవేషన్ హబ్'ను ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ యాదవ్ హబ్‌ను ప్రారంభించారు. సైన్స్ అంశాలను దైనందిన జీవితంతో అనుసంధానం చేసుకునేలా హబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందులో సైన్స్ క్విజ్, సైంటిస్ట్ ఆఫ్ ది వీక్, ఎలిమెంట్ ఆఫ్ ది వీక్, సైన్స్ ఇన్ డైలీ లైఫ్, గ్రీన్ సైన్స్ కార్నర్ వంటి విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో పరిశీలన, ప్రయోగాత్మక అభ్యసనం, శాస్త్రంపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.నరేంద్రబాబు, డా.ఎన్.సుశాసిని, డి.శ్రీలత, ఎ.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## వ్రతం చేశారు.. బంగారం మోరిలో పడేశారు!

వైజాగ్, ఆగస్టు 25 (ఈవార్తలు): విశాఖపట్నంలోని గాజువాకలో జరిగిన ఆసక్తికర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గాజువాక శ్రీనగర్‌కు చెందిన ఉడుముల రమేశ్, దివ్య దంపతులు ఈ నెల 21న అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుమారు 8 తులాల బంగారు ఆభరణాలతో అలంకారం చేశారు. ఆనవాయతీ ప్రకారం మూడు రోజుల పాటు నగలను అమ్మవారి వద్దనే ఉంచారు. ఆదివారం (23వ తేదీ) పూజా సామాగ్రిని తొలగించే క్రమంలో రమేశ్.. అమ్మవారికి అలంకరించిన 3 తులాల హారం, కాసులను మాత్రమే తీసి భద్రపరిచారు. అయితే, పూలు, ఇతర పూజా సామగ్రిలో కలిసిపోయిన సుమారు 5 తులాల బరువున్న కంకణం, రెండు గొలుసులు, మూడు ఉంగరాలను ఆయన గమనించలేదు. నిర్మల్యం మొత్తాన్ని ఒక ఎర్రటి వస్త్రంలో చుట్టి, దుర్గా నగర్ సమీపంలోని స్టీల్ ప్లాంట్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న డ్రైనేజీ కాలువలో పడేశారు. ఇంటికి వెళ్ళిన తర్వాత నగలు కనిపించకపోవడంతో వారికి అనుమానం వచ్చింది. వెంటనే కాలువ వద్దకు పరుగులు తీసి వెతికినా ఫలితం లేకపోవడంతో, స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సీఐ కేశవరావు, సిబ్బందిని రంగంలోకి దించారు. జేసీబీ సహాయంతో కాలువలో నీటి ప్రవాహాన్ని మళ్లించి, వేగాన్ని తగ్గించారు. అనంతరం కాలువలో చెల్లాచెదురుగా పడి ఉన్న నగలను సిబ్బంది ఒక్కొక్కటిగా వెలికితీశారు. ఆ ఆభరణాలను దంపతులకు సురక్షితంగా అప్పగించారు. పోయాయనుకున్న బంగారం తిరిగి చేతికి అందడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పోలీసులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పండగలు, పూజల సమయంలో విలువైన వస్తువుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

# కులగణన ఏం చేస్తున్నారు?

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ





న్యూఢిల్లీ: కులగణనలో వివరాల సేకరణ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని మార్చి.. కులాల పేర్లతో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే అలా నమోదు చేస్తారని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని తెలిపారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు అన్నారు. కులగణనలో 'బ్యాక్‌వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు. కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంథ్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చున్నారు. తెలంగాణ, బీహార్ కుల సర్వేల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి.. రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ కోరారు.

# అడవితోనే ఆదాయం!

**దేశంలోని గిరిజన సముదాయాల ఆర్థిక రూపురేఖలను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకమే 'ప్రధానమంత్రి జనజాతీయ వికాస్ మిషన్' (పీఎంజేవీఎం). అటవీ ప్రాంతాల్లో నివసించే కోట్ల మంది షెడ్యూల్డ్ తెగల ప్రజల వార్షిక ఆదాయంలో చిన్న అటవీ ఉత్పత్తులే ప్రధాన మూలాధారం. గతంలో మార్కెట్ పరిజ్ఞానం లేక, దళారుల చేతిలో మోసపోతూ గిట్టుబాటు ధర దక్కక తీవ్రంగా నష్టపోయిన గిరిజనులకు పీఎంజేవీఎం కొండంత అండగా నిలుస్తోంది. అటవీ సేకరణదారులను పారిశ్రామికవేత్తలుగా మారుస్తూ వారి జీవనోపాధికి కొత్త దారులు చూపుతోంది.**

- అడవిబిడ్డలకు అండగా పీఎం జన్‌జాతీయ వికాస్ మిషన్
- చిన్న అటవీ ఉత్పత్తులతో జీవనోపాధికి కొత్త దారులు
- దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ కనీస మద్దతు ధర
- వన్‌ధన్ వికాస కేంద్రాలతో 12.48 లక్షల మందికి ఉపాధి

(స్పెషల్ స్టోరీ)



### అటవీ వనరులే జీవనాధారం

భారతదేశంలో నివసిస్తున్న 10.4 కోట్ల మంది గిరిజన ప్రజలలో అత్యధికులు అడవులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి తేనె, తునికాకు, ఇప్ప పువ్వు, చింతపండు, లక్క, వెదురు, అడవి మూలికలు కేవలం వనరులు మాత్రమే కావు. వారి వార్షిక ఆదాయంలో దాదాపు 20 నుంచి 40 శాతం వరకు వీటి విక్రయం ద్వారానే సమకూరుతోంది. నేరుగా సేకరించిన ఉత్పత్తులను విక్రయించినప్పటికీ, గతంలో దళారుల వ్యవస్థ కారణంగా శ్రమకు తగ్గ ప్రతిఫలం లభించేది కాదు. ఈ దోపిడీకి స్వస్తి పలకాలనే లక్ష్యంతో 2021--22లో ప్రభుత్వం ఈ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చింది.



### అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర

ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ట్రైఫెడ్) ద్వారా ప్రభుత్వం ప్రస్తుతం 87 రకాల చిన్న అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను అందిస్తోంది. 2013--14 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.693.98 కోట్ల విలువైన 2.67 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను ప్రభుత్వం సేకరించింది మరోవైపు గిరిజన సేకరణదారులను స్వయం సహాయక సంఘాలుగా సమీకరిస్తున్నారు. ప్రతీ 15 సంఘాలను కలిపి (దాదాపు 300 మంది సభ్యులు) ఒక వన్‌ధన్ వికాస కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కనీసం 60 శాతం మంది గిరిజనులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా మంజూరైన 4,172 కేంద్రాలలో ఇప్పటికే 2,911 కేంద్రాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. 2.48 లక్షల మంది గిరిజనులు వీటితో అనుసంధానమై ఉండగా, జులై 2026 నాటికి వీటి ద్వారా రూ.168 కోట్ల మేర వ్యాపారం జరిగింది.

అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర

ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ట్రైఫెడ్) ద్వారా ప్రభుత్వం ప్రస్తుతం 87 రకాల చిన్న అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను అందిస్తోంది. 2013--14 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.693.98 కోట్ల విలువైన 2.67 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను ప్రభుత్వం సేకరించింది మరోవైపు గిరిజన సేకరణదారులను స్వయం సహాయక సంఘాలుగా సమీకరిస్తున్నారు. ప్రతీ 15 సంఘాలను కలిపి (దాదాపు 300 మంది సభ్యులు) ఒక వన్‌ధన్ వికాస కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కనీసం 60 శాతం మంది గిరిజనులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా మంజూరైన 4,172 కేంద్రాలలో ఇప్పటికే 2,911 కేంద్రాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి.

### అటవీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్

కేవలం ఉత్పత్తుల సేకరణకే పరిమితం కాకుండా వాటికి విలువ జోడించేలా గిరిజనులకు ప్రభుత్వం నైపుణ్య శిక్షణ ఇస్తోంది. శాస్త్రీయ పద్ధతుల్లో సేకరణ, పొట్టు తీసే యంత్రాలు, డ్రైయర్లు, ప్యాకేజింగ్ పరికరాలను అందజేస్తోంది. గిరిజ ప్రాంతాల్లోని 5 వేలకు పైగా స్థానిక సంతలను ఆధునికీకరిస్తూ నిల్వ సదుపాయాలు, తాగునీరు, తూకం యంత్రాలను సమకూరుస్తోంది. ఉత్పత్తుల బ్రాండింగ్, ఇ-కామర్స్ వేదికలతో అనుసంధానం, భౌగోళిక సూచికల (జీఐ ట్యాగ్) కేటాయింపు, ప్రదర్శనల నిర్వహణ ద్వారా ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పిస్తోంది. సహజసిద్ధమైన, పర్యావరణహిత ఉత్పత్తులతో వికసిత్ భారత్‌ఏ2047 లక్ష్య సాధనలో గిరిజన ఆర్థిక వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోంది. సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్ స్ఫూర్తికి అద్దం పడుతున్న ఈ మిషన్ మారుమూల అటవీ ప్రాంతాలలో కొత్త వెలుగులు నింపుతోంది.

అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర

# శిశువుకు 4 కాళ్లు, 4 చేతులు

జబల్‌పూర్: మధ్యప్రదేశ్‌లో ఒక అరుదైన వైద్య పరిణామం చోటుచేసుకుంది. లవ్‌కుష్‌నగర్‌లో ఓ మగ శిశువు నాలుగు కాళ్లు, నాలుగు చేతులతో జన్మించాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆ శిశువును చూసేందుకు భారీగా తరలివచ్చారు. వైద్యుల ప్రాథమిక సమాచారం ప్రకారం, శిశువు ఛాతీ భాగం నుండి ఈ అదనపు అవయవాలు పెరిగినట్లు గుర్తించారు. ఈ అసాధారణ పరిస్థితికి జన్యుపరమైన లోపాలు కారణం కావొచ్చని వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అదనంగా ఉన్న కాళ్లు, చేతులను శస్త్రచికిత్స ద్వారా తొలగించే అవకాశాలను వారు పరిశీలిస్తున్నారు. అయితే, సర్జరీకి ముందు ఆ అవయవాల్లోని రక్త ప్రసరణ వ్యవస్థ, ఎముకల అనుసంధానం వంటి కీలక అంశాలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం శిశువుకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాతే శస్త్రచికిత్సపై తుది నిర్ణయం తీసుకుంటామని వైద్యులు స్పష్టం చేశారు. ఇదిలావుండగా, శిశువుకు మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు తక్షణమే స్పందించారు. బాలుడిని ఎయిర్ అంబులెన్స్ ద్వారా జబల్‌పూర్‌లోని ప్రత్యేక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిపుణులైన వైద్యుల బృందం శిశువు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

# మహిళలకు ఎన్‌ఎస్‌జీ శిక్షణ

న్యూఢిల్లీ: భారత ఉగ్రవాద వ్యతిరేక పోరాట విభాగంలో మహిళల కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించే దిశగా జాతీయ భద్రతా దళం (ఎన్‌ఎస్‌జీ) చారిత్రాత్మక ముందడుగు వేసింది. తొలిసారిగా వివిధ రాష్ట్రాల పోలీసు దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) మహిళా సిబ్బంది కోసం హర్యానాలోని మానేసర్‌లోని ఎన్‌ఎస్‌జీ శిక్షణా అకాడమీలో 'మహిళా కమాండో కన్వర్షన్ కోర్సు' (ఎంసీసీసీ)ను ప్రారంభించింది. నారీశక్తి సాధికారతలో ఇదొక నూతన అధ్యాయమని ఎన్‌ఎస్‌జీ పేర్కొంది. 'సాహసవంతులే నాయకత్వం వహిస్తారు' అనే స్ఫూర్తిదాయక నినాదంతో ఈ కోర్సును రూపొందించారు. మొత్తం 12 వారాల పాటు సాగే ఈ అత్యంత కఠినమైన శిక్షణ ద్వారా మహిళా సిబ్బందిని శారీరక, సాంకేతిక, పోరాట రంగాలలో అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఉగ్రవాద నిరోధక ఆపరేషన్లలో వారిని కీలక బాధ్యతల కోసం సిద్ధం చేయనున్నారు. ఈ శిక్షణలో భాగంగా కఠినమైన శారీరక దారుఢ్యం, అధునాతన ఆయుధాల వినియోగం, మార్క్స్‌మన్‌షిప్, వ్యూహాత్మక దాడులు, బందీల విముక్తి వంటి క్లిష్టతరమైన అంశాలపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు. ఈ శిక్షణ కేవలం వ్యక్తిగత నైపుణ్యాల పెంపునకే కాకుండా, వివిధ భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచడానికి కూడా దోహదపడుతుందని ఎన్‌ఎస్‌జీ స్పష్టం చేసింది.



# సైన్యం చేతికి 'షేర్'

## దేశీయంగా తయారైన ఏకే-203 రైఫిళ్లు రెడీ

అమేథీ: రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించే దిశగా భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లా కోర్వాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో దేశీయంగా తయారు చేసిన ఏకే-203 అసాల్ట్ రైఫిళు భారత సైన్యానికి చేరవేసేందుకు సిద్ధమయ్యాయి. త్వరలోనే వీటి డెలివరీ ప్రారంభం కానుంది. ఈ అత్యాధునిక రైఫిళ్లకు 'షేర్' అని పేరు పెట్టారు. సైన్యానికి చిన్న ఆయుధాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ రైఫిళ్లు కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. ఈ రైఫిళ్లను ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి చేస్తోంది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మేజర్ జనరల్ సుధీష్ కుమార్ శర్మ మాట్లాడుతూ.. అమేథీలో ఏకే-203 రైఫిళ్లను తయారు చేయడం దేశానికి గర్వకారణమని అన్నారు. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 'షేర్' రైఫిళ్లను ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. భారత సైన్యానికి సకాలంలో రైఫిళ్లను అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2019లో భారత సైన్యం, రక్షణ మంత్రిత్వ శాఖ ఈ రైఫిళ్ల తయారీకి సంబంధించిన నిర్ణయం తీసుకున్నాయని శర్మ గుర్తుచేశారు. ఒప్పందంలో భాగంగా, రష్యా నుంచి టెక్నాలజీ బదిలీ జరిగిందని, ఆ తర్వాత దేశీయ ఉత్పత్తి కోసం కాంట్రాక్ట్ కుదిరిందని వివరించారు. ఒప్పందం ప్రకారం నిర్దేశించిన సమయానికి రైఫిళ్లను అందిస్తామనే నమ్మకంతో రక్షణ శాఖ తమపై విశ్వాసం ఉంచిందని ఆయన పేర్కొన్నారు.

# భారీగా హెచ్1ఎన్1 కేసులు

## భయం అవసరం లేదన్న ఐసీఎంఆర్




న్యూఢిల్లీ: దేశంలోని పలు రాష్ట్రాల్లో హెచ్1ఎన్1 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనిపై 'భారత వైద్య పరిశోధనా మండలి' (ఐసీఎంఆర్) స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త వైరస్ కాదని తెలిపింది. 2009లో మహమ్మారికి కారణమైన అదే ఇన్‌ఫ్లుయెంజా-ఏ (హెచ్1ఎన్1) పీడీఎం09 వైరస్ ఇప్పుడు ఫ్లూగా కొనసాగుతోందని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ వెల్లడించారు. ప్రతి సీజన్‌లో వైరస్‌లో చిన్నపాటి జన్యు మార్పులు సహజంగానే జరుగుతాయని చెప్పారు. దానివల్ల కొత్తగా మరింత ప్రమాదకరమైన వైరస్ పుట్టినట్లుగా భావించాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ భాగం స్వల్ప లక్షణాలతోనే తగ్గిపోతున్నాయని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. హెచ్1ఎన్1పై ఐసీఎంఆర్ నిరంతరం నిఘా కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా 73 ప్రత్యేక ఆసుపత్రులతో కూడిన సెంటినెల్ నిఘా వ్యవస్థ ద్వారా ప్రతివారం శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల నమూనాలను పరీక్షిస్తున్నారు. తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులతో వచ్చే రోగులు, ఫ్లూ లక్షణాలతో వచ్చే వారి నుంచి నమూనాలు సేకరిస్తున్నారు. మరో 167 వైరస్ పరిశోధన, నిర్ధారణ ప్రయోగశాలలు కూడా పరీక్షలు నిర్వహిస్తున్నాయి. హెచ్1ఎన్1తో పాటు హెచ్3ఎన్2, ఇన్‌ఫ్లుయెంజా-బి, కొవిడ్-19, హెచ్ఎంపీవీ, అడెనోవైరస్ వంటి ఇతర వైరస్‌లను కూడా పరీక్షల్లో గుర్తిస్తున్నారు. ప్రస్తుతం హెచ్3ఎన్2 కేసులు 2-3 శాతం వరకు ఉన్నాయని ఐసీఎంఆర్ తెలిపింది.

# కొత్త జాబ్‌కు ట్రయల్స్

## ప్రతి ఇద్దరిలో ఒకరిది ఇదే ఆలోచన.. భారత్‌లో పెరుగుతున్న సంక్షోభం



న్యూఢిల్లీ: భారత్‌లో ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో జనరేషన్ జెడ్ (జెన్-జీ) ఉద్యోగుల వాటా రెండింతలైంది. అదే సమయంలో ఉద్యోగులను సంస్థల్లో కొనసాగించుకోవడం పెద్ద సవాలుగా మారుతోంది. ప్రతి ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరు కొత్త ఉద్యోగం కోసం చూస్తున్నట్లు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం.. ప్రస్తుత సంస్థను వీడాలని చూస్తున్న ఉద్యోగుల్లో నలుగురిలో ముగ్గురు వచ్చే 12 నెలల్లోనే బయటకు వెళ్లాలని భావిస్తున్నారు. 1.1 లక్షలకు పైగా ఉద్యోగులతో పనిచేస్తున్న 130కి పైగా సంస్థలపై అధ్యయనం చేసి ఈ వివరాలు వెల్లడించారు. 2023లో ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలోని మొత్తం ఉద్యోగుల్లో జెన్-జీ వాటా 17 శాతంగా ఉండగా.. ప్రస్తుతం 34 శాతానికి చేరింది. వేతనం, గుర్తింపు, పదోన్నతికి సంబంధించిన ప్రమాణాలపై స్పష్టత లేకపోవడాన్ని ఈ తరం ఉద్యోగులు పెద్దగా సహించడంలేదని నివేదిక తెలిపింది. తమ అంచనాలు నెరవేరకపోతే త్వరగా ఉద్యోగం మారే ధోరణి కనిపిస్తోందని పేర్కొంది. మరోవైపు.. ఫ్రంట్‌లైన్ మేనేజర్లు, సూపర్‌వైజర్లలో ఏకంగా 86 శాతం మంది కొత్త ఉద్యోగం కోసం చూస్తున్నారు. వ్యక్తిగత స్థాయిలో పనిచేసే ఉద్యోగుల్లో ఈ సంఖ్య 53 శాతంగా ఉంది. ప్రాజెక్టుల ఒత్తిడి, క్లయింట్ల డిమాండ్లు, బృందాలను చూసుకోవడం వంటి బాధ్యతలు మేనేజర్లపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయని నివేదిక పేర్కొంది. సంస్థల్లో పని పరిస్థితులు కొంత మెరుగుపడుతున్నా.. ఉద్యోగులు తమ బాధ్యతలకు మించి పనిచేయాలనే ఆసక్తి మాత్రం క్రమంగా తగ్గుతోందని తెలిపింది. దీర్ఘకాలిక అనుబంధం కోసం భౌతిక సదుపాయాల కంటే సంస్థాగత, సాంస్కృతిక మార్పులు అవసరమని వివరించింది. ఇక దాదాపు 60 శాతం సంస్థలు రోజువారీ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను వినియోగిస్తున్నాయి. అయితే ఏఐ సాధనాల వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలపై తమకు తగిన సమాచారం అందిందని కేవలం 20 శాతం మంది ఉద్యోగులే బలంగా అంగీకరించారు.

# డ్రగ్స్‌తో చిక్కిన మాజీ ఎయిర్ హోస్టెస్

వడోదర నుంచి ముంబైకి డ్రగ్స్ తరలిస్తుండగా అరెస్ట్



ముంబై: విమానయాన రంగంలో పనిచేసిన ఓ మాజీ ఉద్యోగిని డ్రగ్స్ స్మగ్లర్‌గా మారింది. గుజరాత్‌లోని వడోదర నుంచి ముంబైకి దాదాపు రూ. 30 లక్షల విలువైన మెఫెడ్రోన్ (ఎండీ) డ్రగ్స్‌ను అక్రమంగా తరలిస్తున్న మాజీ ఎయిర్ హోస్టెస్, ఆమె సహచరుడిని సూరత్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 977 గ్రాముల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వడోదర నుంచి ముంబైకి కారులో భారీగా డ్రగ్స్ తరలిస్తున్నారని సూరత్ క్రైమ్ బ్రాంచ్‌కు కచ్చితమైన సమాచారం అందింది. దీంతో సూరత్ గ్రామీణ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సహాయంతో పాల్సానాలోని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న ఏనా గ్రామ టోల్ ప్లాజా వద్ద నిఘా పెట్టారు. అనుమానాస్పదంగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, అందులో డ్రగ్స్ ప్యాకెట్లు లభించాయి. కారులో ఉన్న వారిని ముంబై శాంతాక్రూజ్‌కు చెందిన మాజీ క్యాబిన్ క్రూ సభ్యురాలు మాన్సీ అబ్దుల్ సయ్యద్ (41), సోహెల్ సులేమాన్ షేక్ (20)గా గుర్తించారు.

# డేరా బాబాకు మళ్లీ పెరోల్

## 20 ఏళ్ల జైలు శిక్షలో 17వ సారి బయటకు

చండీగఢ్: ఇద్దరు మహిళా అనుచరులపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్‌కు మరోసారి పెరోల్ లభించింది. ఈసారి 21 రోజుల పాటు జైలు నుంచి బయట ఉండేందుకు అనుమతి ఇచ్చారు. 2017లో శిక్ష పడిన తర్వాత రామ్ రహీమ్ జైలు నుంచి బయటకు రావడం ఇది 17వసారి. ప్రస్తుతం హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైలులో ఉన్న అతడు, పెరోల్ సందర్భంగా సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయానికి వెళ్లనున్నాడు. ఈ ఏడాది మే 26న అతడికి 30 రోజుల పెరోల్ మంజూరైంది. ఆ సమయంలో కూడా సిర్సా డేరా కేంద్రంలోనే ఉన్నాడు. ఈ ఏడాది జనవరిలో 40 రోజుల పెరోల్, 2025 ఆగస్టులో మరో 40 రోజుల పెరోల్ లభించింది. 2025 ఏప్రిల్‌లో 21 రోజుల ఫర్లో, అదే ఏడాది జనవరిలో 30 రోజుల పెరోల్ కూడా ఇచ్చారు.

# రెండు వారాల్లోగా లొంగిపోవాలి

## తరుణ్ తేజ్‌పాల్‌కి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: తహెల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కి సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలింది. 2013 నాటి అత్యాచారం కేసులో తనకు విధించిన 10 ఏళ్ల జైలు శిక్షపై అప్పీల్ విచారించే వరకు లొంగిపోవడం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ఏకసభ్య ధర్మాసనం తేజ్‌పాల్‌ను రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ లొంగిపోయినట్లు ధృవీకరణ పత్రాన్ని దాఖలు చేస్తేనే ఆయన అప్పీల్‌పై విచారణను సెప్టెంబర్ 22న చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
బుధవారం 26-8-2026, జగిత్యాల | www.evarthalu.com | 10

వయ్యారి చిత్రం


రుక్మిణి వసంత్





## హీరోయిన్ రచ్చ.. పారితోషికం టీటీడీకి!

కికు యనమల హీరోగా నటించిన కికు చిరంజీవి సినిమా ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. సుభ సాయి వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సర్వైవల్ డ్రామా థ్రిల్లర్ ఆగస్టు 28న థియేటర్లలోకి రాబోతోంది. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇటీవల జరిగిన ప్రెస్ మీట్ లో నిర్మాత దీప్తి నడిమింటి హీరోయిన్ కాశిష్ ఖాన్ గురించి చెప్పిన విషయాలు నెట్టింట వైరల్ అయ్యాయి. హీరోయిన్ వ్యవహార శైలి, షూటింగ్ టైమ్ లో పెట్టిన ఇబ్బందులను ఆమె ఓపెన్ గా చెప్పారు. అగ్రిమెంట్ లో ఉన్న డబ్బుల కోసం ప్రమోషన్స్ కు రాకుండా కాశిష్ చేసిన రచ్చ గురించి వివరించారు. సినిమా ప్రమోషన్స్ లో పాల్గొంటే కాశిష్ ఖాన్ కు లక్ష రూపాయలకు పైగా చెల్లించాలని అగ్రిమెంట్ లో ఉంది. కానీ ఆమె ఈవెంట్స్ కు రాకముందే ఆ డబ్బులు మొత్తం అడిగిందని నిర్మాత చెప్పారు. అగ్రిమెంట్ ప్రకారం కాకుండా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించినందుకు ఆమెకు ఆ డబ్బులు ఇచ్చేది లేదని ప్రెస్ మీట్ లోనే దీప్తి తేల్చి చెప్పారు.



అలాగే బెదిరింపులకు కూడా పాల్పడినట్లు. తెలిపారు. ఆ డబ్బును హీరోయిన్ కు ఇచ్చే బదులు ఒక మంచి పనికి ఉపయోగిస్తానని ఆమె స్టేజ్ మీద ప్రకటించారు. తిరుపతి తిరుమల దేవస్థానంలో చిన్న పిల్లల హార్ట్ ఆపరేషన్స్ కోసం నడుస్తున్న ట్రస్ట్ కు ఆ డబ్బును విరాళంగా ఇస్తానని మాట ఇచ్చారు.

## 90'స్ కిడ్స్ క్రష్ శ్రియకు భలే చాన్సులు

సినిమా ఇండస్ట్రీలో 'ఇష్టం' సినిమాతో పాతిక ఏళ్ల క్రితం అడుగు పెట్టిన శ్రియ ఇప్పటి వరకు సినిమాలు చేస్తూ బిజీగానే ఉంది. ఏడాదికి రెండు మూడు సినిమాల్లో కనిపించడం ద్వారా తన తరం హీరోయిన్స్ మాత్రమే కాకుండా ఈతరం హీరోయిన్స్ సైతం నోరు వెళ్లబెట్టి మరీ చూసే విధంగా చేస్తుంది. శ్రియ కెరీర్ ఖతం అయినట్లే అనుకున్న ప్రతిసారి వరుస సినిమాల్లో నటించడం ద్వారా లైన్‌లోనే ఉన్నట్లుగా చెప్పకనే చెబుతూ వస్తుంది. శ్రియ ఈ మధ్య కాలంలో హీరోయిన్ పాత్రలు మాత్రమే కాకుండా కథలో కీలకమైన పాత్రలు, గెస్ట్ రోల్స్, నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలను సైతం చేస్తూ వస్తుంది. గత ఏడాది రెట్రో, మిరాయ్ సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా మిరాయ్ సినిమాలో శ్రియ పాత్రకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అంతే కాకుండా సినిమాకు శ్రియ హీరో అని చాలా మంది సైతం కామెంట్స్ చేసిన విషయం తెల్సిందే. ఇక ఈ ఏడాదిలో ఇప్పటికే సందక్కారి అనే తమిళ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాతో మరోసారి తమిళ ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసింది. ప్రస్తుతం ఈమె చేతిలో మరో రెండు మూడు తమిళ సినిమాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా బాబీ ప్రధాన పాత్రలో నటిస్తున్న నాన్ వైలెన్స్ సినిమాలో శ్రియ కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఆ సినిమా గురించిన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తాజాగా శ్రియ మరో తమిళ మూవీని కన్ఫర్మ్ చసింది. రజనీకాంత్‌తో కలిసి ఉన్న ఫోటోను శ్రియ షేర్ చేయడం ద్వారా తన కొత్త సినిమాను ప్రకటించినట్లు అయింది. గతంలో రజనీకాంత్‌తో శ్రియ సినిమా చేసిన విషయం తెల్సిందే. వీరిద్దరి కాంబోలో వచ్చిన శివాజీ మూవీ హాలీవుడ్ రేంజ్‌లో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. మళ్లీ ఇన్నాళ్లకు ఈ కాంబో రిపీట్ కాబోతుంది.



## తమిళులు ఆదరించారు



టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి శ్రీగౌరి ప్రియ తాజాగా తన సినీ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. భాషా బేధాలతో సంబంధం లేకుండా మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని నిరూపిస్తున్నారు. ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, విజయాల గురించి మీడియాతో ముచ్చటించారు. తెలుగు నేపథ్యం ఉన్నా కోలీవుడ్‌లో అడుగుపెట్టి తక్కువ సమయంలోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకోవడం పట్ల గౌరీ సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో గౌరీ ప్రియ నటించిన ప్రాజెక్టులు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విభిన్న కథాంశాలతో వస్తున్న చిత్రాలను ఎంచుకుని నటిగా తన పరిధిని విస్తరించుకుంటున్నట్లు తెలిపారు. సినిమా పరిశ్రమలో ఒక భాష నుంచి మరో భాషకు వెళ్లినప్పుడు మొదట్లో కొన్ని సవాళ్లు ఎదురుకావడం సహజమేనని శ్రీగౌరి ప్రియ పేర్కొన్నారు. అయితే తమిళ దర్శకులు, సాంకేతిక నిపుణులు అందించిన సహకారం వల్ల తమిళ భాషపై పట్టు సాధించగలిగానని వెల్లడించారు.



## దుస్తుల్లో ఏముంది.. గుండెల్లో ఉండాలి: కృతిసనన్

రాఖీ పండుగ నేపథ్యంలో ఓ జ్యులరీ బ్రాండ్ వాణిజ్య ప్రకటనను రిలీజ్ చేసింది నటి కృతి సనన్. ఆ బాలీవుడ్ హీరోయిన్ నటించిన యాడ్ వివాదాస్పదమైంది. బికినీ దుస్తుల్లో సోదరుడికి రాఖీ కట్టాల్సిన అవసరం ఏంటి అని ఎంపీ కంగనా రనౌత్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో నటి కృతి సనన్ మౌనం వీడారు. ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై ఆమె రియాక్ట్ అయ్యారు. శతాబ్దాలుగా స్త్రీలు ధరించే దుస్తుల్లో మార్పులు జరిగాయని, కానీ మహిళకు గౌరవం అనేది ఆమె వేసుకునే దుస్తులపై ఇంకా ఆధారపడుతోందని అన్నారు. సంస్కృతి, సంప్రదాయం అనేది గుండెల్లో ఉంటాయని, నెక్‌లైన్‌లో కాదని కీర్తి అన్నారు. ఆడవాళ్లు ఏ దుస్తులు వేసుకోవాలో చెప్పడం ఇంకెప్పుడు ఆపేస్తారని ఆమె ప్రశ్నించారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో కృతి తాజాగా ఈ టాపిక్‌పై స్పందించారు. అయితే, కృతి వ్యాఖ్యలపై పలువురు మండిపడుతున్నారు. గుడికి బికినీ వేసుకొని వెళ్లరు కదా.. బీచ్‌లో చీర కట్టుకొని ఉండరు కదా.. ఏ సందర్భాన్ని బట్టి, ఏ సంప్రదాయాన్ని బట్టి ఆ సంప్రదాయాన్ని ఫాలో కావాలని కృతికి చురకలు అంటిస్తున్నారు.

## సారా అర్జున్‌కు భారీ సవాల్



దిగ్గజ నటి మధుబాల బయోపిక్ లో నటించే ఛాన్స్ సారా అర్జున్‌కు దక్కింది. ప్రొడ్యూసర్ సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జస్మీత్ కె. రీన్ దర్శకత్వం వహించనున్నారు. ఒక మామూలు హీరోయిన్ పాత్ర చేయడం వేరు, మధుబాల లాంటి లెజెండరీ యాక్ట్రెస్ ను తెరమీద బతికించడం వేరు. మ్యాజిక్ సినిమాలో ఇప్పటి జనరేషన్ అమ్మాయిగా కనిపిస్తున్న సారా, ఈ బయోపిక్ కోసం పూర్తిగా పాత కాలం నాటి వాతావరణంలోకి వెళ్లాలి. ఆనాటి నటీమణుల లుక్, హావభావాలు, నడిచే తీరు పర్ఫెక్ట్‌గా పట్టుకోవాలి. జనాలకు తెలిసిన మొహాన్ని తెరమీద ప్రెజెంట్ చేస్తున్నప్పుడు కచ్చితంగా పోలికలు వస్తాయి. వాటిని తట్టుకుని నటనతో మెప్పించడం అనేది ఈ వయసులో సారాకు ఒక పెద్ద సవాల్ లాంటిదే. సారా దగ్గర ఇప్పుడు అసలు ప్లస్ వయసు.

## బేబీ నక్షత్రను హీరోయిన్‌ను చేస్తా



ఇరుముడి మూవీ మేకర్స్ 'మైత్రి మూవీ మేకర్స' నిర్మాతలలో ఒకరైన ప్రముఖ నిర్మాత రవిశంకర్.. రవితేజ కూతురిగా నటించిన చైల్డ్ ఆర్టిస్ట్ నక్షత్రకి బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. "భవిష్యత్తులో నక్షత్ర హీరోయిన్ అవ్వాలని కోరుకుంటే.. ఆమెకు ఆ ఆలోచన ఉంటే.. తనను మా కూతురిగా భావించి, హీరోయిన్గా ఆమెను ఇండస్ట్రీకి లాంచ్ చేస్తాం. ఆమె పేరులోనే స్టార్ ఉంది. అద్భుతంగా నటించింది" అంటూ ఆమెపై ప్రశంసలు కురిపించారు నిర్మాత రవిశంకర్. మొత్తానికైతే చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇరగదీసేసిన ఈమెకు హీరోయిన్గా ఇంట్రెస్ట్ ఉంటే తమ బ్యానర్ ద్వారానే లాంచ్ చేస్తామని ప్రకటించడం నిజంగా నక్షత్ర అందుకున్న అతిపెద్ద బంపర్ ఆఫర్ అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



# భారత్‌దే ఆధిపత్యం

## పట్టుబిగించిన టీమిండియా.. సత్తా చాటిన బౌలర్లు

### లంక 265 పరుగుల వెనుకంజ.. ముగిసిన మూడో రోజు ఆట

**శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. దాంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు.**

**పసిందు సూర్యబండార(133 బంతుల్లో 9 ఫోర్లతో 80) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయాడు.**

శ్రీలంక ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. నాలుగో రోజు ఆటలో వీలైనంత త్వరగా శ్రీలంకను ఆలౌట్ చేసి భారత్ బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. ఒక సెషన్ పాటు బ్యాటింగ్ చేసి 300 ప్లస్ లక్ష్యాన్ని శ్రీలంక ముందు ఉంచి విజయం కోసం ప్రయత్నించనుంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే. 8/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. కామిందు మెండీస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండీస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ.. 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. ఈ వికెట్‌తో 20 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. లాహిరు కుమారా ఆచితూచి ఆడగా..



సోనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరో వికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది.



# సీఎస్కేతో ధోనీకి విభేదాలు?

చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే)తో ఆ జట్టు మాజీ కెప్టెన్, భారత దిగ్గజ ప్లేయర్ మహేంద్ర సింగ్ ధోనీకి విభేదాలు తలెత్తాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సీఎస్‌కే సహయజమానిగా మారుతాననే ధోనీ అభ్యర్థనను ఆ జట్టు మేనేజ్‌మెంట్ తిరస్కరించడంతో ఇరు పక్షాల మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ ఆరంభం నుంచి సీఎస్‌కేకు ఆడుతున్న ధోనీ.. ఆ జట్టు ఎదుగుదలకు ఎంతో కృషి చేశాడు. ధోనీ కారణంగానే ఆ జట్టు పాపులర్ టీమ్‌గా ఎదిగింది. 6 ఏళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ.. సీఎస్‌కే కోసమే ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. ప్రస్తుతం 45 ఏళ్ల వయసులో ఉన్న ధోనీ.. ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే సీఎస్‌కే షేర్లను కొనుగోలు చేసేందుకు ధోనీ ఆసక్తి చూపించినట్లు వార్తలు వస్తున్నాయి. తద్వారా ధోనీ సహయజమానిగా మారాలని భావించాడట. సీఎస్‌కే షేర్లను ఉచితంగా కాకుండా డబ్బులు చెల్లించేందుకు కూడా ధోనీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. కానీ ధోనీ 25 శాతం షేర్లను అడిగాడని, సీఎస్‌కే మాత్రం 3 శాతం మాత్రమే ఆఫర్ చేసిందని, దాంతో ధోనీ 20 శాతం షేర్లకు తగ్గాడని ఓ నివేదిక పేర్కొంది. చివరకు ధోనీ 18 శాతం షేర్లు అడగ్గా.. సీఎస్‌కే 5.5 శాతం కంటే ఎక్కువ ఇచ్చేది లేదని స్పష్టం చేసిందంట. అయితే మౌఖింగా జరిగిన ఈ చర్చలు విఫలమయ్యాయని, ధోనీకి, సీఎస్‌కే మేనేజ్‌మెంట్ మధ్య ఏళ్ల తరబడి ఉన్న సంబంధం తెగిపోవడానికి దారితీసిందని సదరు రిపోర్ట్ వెల్లడించింది. గత కొన్నేళ్లుగా ధోనీని సంప్రదించకుండానే ఆటగాళ్ల ఎంపిక జరుగుతుందనే వాదన ఉంది. సీఎస్‌కేతో ధోనీకి తలెత్తిన విభేదాల నేపథ్యంలో అతను ఐపీఎల్ 2027 సీజన్ ఆడుతాడా? లేక రిటైర్మెంట్ ప్రకటించి దూరంగా ఉంటాడా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సీఎస్‌కే మెంటార్‌గా ధోనీ బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరుగుతుండగా.. తాజా విభేదాలతో ఇది సాధ్యమవుతుందా? అనేది ప్రశ్నగా మారింది.

# యూపీ క్రికెట్‌కు జెన్ జీ సెగ

దేశాన్ని కుదిపేసిన జెన్–జీ నిరసనల సెగ ఇప్పుడు క్రికెట్‌కు కూడా తాకింది. ఉత్తరప్రదేశ్‌కు ఒకే రంజీ టీమ్ సరిపోదని, మూడు జట్లను ఏర్పాటు చేయాలని జెన్–జీ క్రికెటర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్(యూపీసీఏ)ను మూడు భాగాలుగా విభజించాలని డిమాండ్ చేస్తూ లక్నో స్టేడియంలో నిరసన వ్యక్తం చేశారు. సుమారు 250 మంది జెన్ జీ క్రికెటర్లు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ నిరసనల్లో పాల్గొనడం క్రికెట్ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. యూపీసీఏ క్రికెటర్ల అసోసియేషన్, పూర్వాంచల్ క్రికెట్ అసోసియేషన్ ఆటగాళ్ల ఆధ్వర్యంలో లక్నోలోని ఏకాన స్టేడియంలో ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూపీ చాలా పెద్ద రాష్ట్రమని, జానాభా కూడా ఎక్కువేనని, ఒకే రంజీ టీమ్ కారణంగా ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతుందని నిరసనకారులు ఆరోపించారు. యూపీ క్రికెట్ అసోసియేషన్‌ను మూడు అసోసియేషన్లుగా విభజించి మూడు రంజీ టీమ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలపై యూపీ క్రికెట్ ప్లేయర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ అరవింద్ సింగ్ మాట్లాడుతూ.. మూడు జట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. 'యూపీ వంటి పెద్ద రాష్ట్రానికి ఒకటి కంటే ఎక్కువ రంజీ టీమ్స్ ఉండాల్సిన అవసరం ఉందని సీఎం యోగి ఆదిత్య నాథ్ గతంలో అన్నారు. 25 కోట్ల జనాభా ఉన్న రాష్ట్రానికి మూడు క్రికెట్ అసోసియేషన్స్, వాటి ద్వారా మూడు రంజీ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలి. అప్పుడే ప్రతిభావంతమైన ఆటగాళ్లకు దేశవాళీ క్రికెట్ ఆడే అవకాశం లభిస్తుంది.'అని ఆయన పేర్కొన్నారు.

# లంక బ్యాటర్ ప్రభాత్‌పై చర్యలు

శ్రీలంక బ్యాటర్ ప్రభాత్ జయసూర్యపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) చర్యలు తీసుకుంది. భారత్‌తో కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో ప్రభాత్ జయసూర్య..ఐసీసీ నియమావళిని ఉల్లంఘించాడనే కారణంతో ఓ డీ మెరిట్ పాయింట్ కేటాయించడంతో పాటు మందలించింది. రెండో రోజు ఆటలో మానవ్ సుతార్ బౌలింగ్‌లో ఔటైన ప్రభాత్ జయసూర్య.. మైదానం వీడే సమయంలో బౌండరీ లైన్‌ను బ్యాట్‌తో కొట్టాడు. ఈ చర్య ఐసీసీ ఆర్టికల్ 2.2 క్రికెట్ పరికరాలు, దుస్తులు, మైదాన సామగ్రిని ధ్వంసం చేయడం కిందికి వస్తుంది. దాంతో అతను ఐసీసీ లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించినట్లు తేలింది. ప్రభాత్ జయసూర్య తన తప్పిదాన్ని, విధించిన శిక్షను అంగీకరించాడు. దాంతో ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి విచారణ అవసరం లేదని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది.

# సెమీస్‌కు ఈస్ట్ జోన్



## నార్త్ ఈస్ట్ జోన్‌పై విజయం

ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ 2026లో ఈస్ట్ జోన్ శుభారంభం చేసింది. నార్త్ ఈస్ట్ జోన్‌తో మంగళవారం ముగిసిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ 210 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ భారీ విజయంతో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఈస్ట్ జోన్ 112.5 ఓవర్లలో 467 పరుగుల భారీ స్కోర్ చేసింది. సుదీప్ కుమార్ ఘరమి(185 బంతుల్లో 25 ఫోర్లు, సిక్స్‌తో 146), షెహ్‌బాజ్ అహ్మద్(244 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్స్‌లతో 167) సెంచరీలతో చెలరేగారు. వైభవ్(8)తో పాటు కెప్టెన్ ఇషాన్ కిషన్(4)కూడా నిరాశపర్చాడు. అనంతరం నార్త్ ఈస్ట్ జోన్ 111 పరుగులకు ఆలౌటైంది. అభిజిత్ సర్కార్(5/20) ఐదు వికెట్లు తీయగా.. షెహ్‌బాజ్ అహ్మద్(3/20) మూడు వికెట్లు పడగొట్టాడు. అనుకుల్ రాయ్‌కు ఒక వికెట్ దక్కింది. మహమ్మద్ షమీ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. దాంతో నార్త్ ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ ఆడాల్సి వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ నార్త్ ఈస్ట్ జోన్ 146 పరుగులకే కుప్పకూలింది. అనుకుల్ రాయ్(5/37) ఐదు వికెట్లు తీయగా.. వైభవ్ సూర్యవంశీ(2/11) రెండు వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ కుమార్, అభిజిత్ సర్కార్, షెహ్‌బాజ్ అహ్మద్ తలో వికెట్ తీసారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ షమీ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌లో విఫలమైనా.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇషాన్ కిషన్ అద్భుతమైన కెప్టెన్‌తో జట్టును గెలిపించగా.. వైభవ్ సూర్యవంశీ రెండు వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ కెప్టెన్సీ ఆకట్టుకుంది. పరిస్థితులకు తగ్గట్లు ఫీల్డ్ సెటప్ మార్చడంతో పాటు బౌలర్లను రొటేట్ చేసి ఫలితాలను రాబట్టాడు. ఆదివారం ప్రారంభమయ్యే తొలి సెమీఫైనల్లో సెంట్రల్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడనుంది.

### బౌలింగ్‌లోనూ అదరగొట్టిన వైభవ్

టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ కళ్లు చెదిరే బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. తద్వారా తనకు బౌలింగ్ చేసే సత్తా కూడా ఉందని ఈ సిక్సర పిడుగు చాటి చెప్పాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ 2026లో ఈస్ట్ జోన్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. నార్త్ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న తొలి రౌండ్ మ్యాచ్‌లో తన అద్భుతమైన బౌలింగ్‌తో ఆశ్చర్యపరిచాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో విఫలమైన వైభవ్ సూర్యవంశీ(6 బంతుల్లో 8).. బౌలింగ్‌లో మాత్రం 4 బంతుల్లోనే 2 వికెట్లు తీసాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ బౌలింగ్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

# వైభవ్‌కు టెస్టులు ఇప్పుడే వద్దు: ద్రవిడ్

భారత క్రికెట్ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తున్న టీమిండియా యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ కెరీర్‌పై భారత మాజీ హెడ్ కోచ్, దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వైభవ్ సూర్యవంశీకి మూడు ఫార్మాట్లలోనూ ఆడే అద్భుతమైన సత్తా ఉందని కొనియాడిన రాహుల్ ద్రవిడ్.. అయితే టెస్ట్ క్రికెట్లోకి అతడిని ఇప్పుడే తొందరపడి తీసుకురావడం సరైన నిర్ణయం కాదని స్పష్టం చేశారు. టెస్ట్ ఫార్మాట్లో రాణించడానికి వైభవ్ సూర్యవంశీకి ఇంకా సమయం పడుతుందని.. అవకాశం ఇవ్వాలని ద్రవిడ్ అభిప్రాయ పడ్డారు. వైట్ బాల్ క్రికెట్లో వైభవ్ ప్రదర్శన అత్యంత విస్మయపరిచేలా ఉంది. ఐపీఎల్ 2026 సీజన్లో 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు సాధించి.. 237.30 భారీ స్ట్రైక్ రేట్‌తో ఆరెంజ్ క్యాప్ గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే ఫస్ట్–క్లాస్ క్రికెట్లో వైభవ్ అనుభవం ఇంకా పరిమితంగానే ఉంది. 8 ఫస్ట్–క్లాస్ మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ 17.25 సగటు మాత్రమే నమోదు చేశాడు. అందువల్ల సుదీర్ఘ ఫార్మాట్ కు అలవాటు పడేందుకు, క్రీజులో ఎక్కువసేపు నిలబడే నైపుణ్యం పెంపొందించుకునేందుకు వైభవ్ సూర్యవంశీకి ప్రాక్టీస్ అవసరమని రాహుల్ ద్రవిడ్ గుర్తు చేశారు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## ఇదెక్కడి సామాజిక న్యాయం?

సామాజిక న్యాయం అనే మాటను కాంగ్రెస్ పార్టీ పదేపదే తన రాజకీయ అస్త్రంగా వినియోగిస్తోంది. బీసీలకు అధిక ప్రాధాన్యం, కులగణన, రాజకీయ అవకాశాలు, ప్రాతినిధ్యం అంటూ గొప్పగా ప్రచారం చేస్తోంది. కానీ ఆ మాటలకు, పార్టీ ఆచరణకు మధ్య పెరుగుతున్న అంతరాన్ని చూస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణలో బీసీ మహిళా నాయకురాలు, మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం, పార్టీ పెద్దలు తీవ్రంగా స్పందిస్తుంటే.. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివాదాస్పదంగా మాట్లాడిన సందర్భాల్లో మాత్రం అదే స్థాయి స్పందన ఎందుకు కనిపించలేదన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. ఒకే పార్టీలో ఇద్దరు నాయకులు. ఇద్దరూ అధికార పక్షానికి చెందినవారే. ఇద్దరూ పార్టీ విధానం, ప్రభుత్వ పనితీరు, నాయకత్వంపై బహిరంగంగా అభిప్రాయాలు వ్యక్తం చేసినవారే. అయితే ఒకరి విషయంలో వెంటనే క్రమశిక్షణ, నియంత్రణ, హెచ్చరికల చర్చ మొదలవుతుంటే.. మరొకరి విషయంలో మౌనం ఎందుకు? ఇదే అసలు చర్చనీయాంశం. ఇక్కడ కొండా సురేఖను సమర్థించడమో, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని తప్పుపట్టడమో ప్రధాన విషయం కాదు. ప్రజాస్వామ్య రాజకీయ పార్టీలో నిబంధనలు అందరికీ ఒకేలా వర్తిస్తున్నాయా లేదా? అనేదే అసలు ప్రశ్న. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినప్పుడు వ్యక్తి కులం, సామాజిక నేపథ్యం, రాజకీయ బలం, ఆర్థిక స్థితి, కుటుంబ నేపథ్యం చూసి నిర్ణయాలు తీసుకుంటే దానిని సామాజిక న్యాయం అనలేం. కొండా సురేఖ బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా నాయకురాలు. అనేక రాజకీయ ఒడిదొడుకులను ఎదుర్కొని ప్రజాజీవితంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అలాంటి నాయకురాలి విషయంలో పార్టీ పెద్దలు వెంటనే స్పందించడం, ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించడం తప్పు కాకపోవచ్చు. కానీ అదే ప్రమాణాన్ని ఇతర నేతల విషయంలో కూడా చూపించాలి. అప్పుడే కాంగ్రెస్ చెప్పుకునే సామాజిక న్యాయానికి విశ్వసనీయత ఉంటుంది. రాజకీయాల్లో నాయకుల మాటలపై స్పందించడం ఎంత ముఖ్యమో.. కొన్ని సందర్భాల్లో స్పందించకపోవడం కూడా అంతే ముఖ్యమైన రాజకీయ సంకేతం. కొందరు మాట్లాడితే వెంటనే పార్టీ పెద్దలు స్పందించడం, మరికొందరు ఎంత ఘాటుగా మాట్లాడినా పట్టించుకోకపోవడం.. పార్టీ అంతర్గత శక్తి సమీకరణాలను బయటపెడుతుంది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుల విషయంలో పార్టీ ఒక రకంగా, బీసీ నాయకుల విషయంలో మరో రకంగా వ్యవహరిస్తోందనే భావన బీసీ వర్గాల్లో బలపడితే దానికి బాధ్యత ఎవరిది? ఒక పార్టీ సామాజిక న్యాయం గురించి మాట్లాడటమే కాదు.. ఆ న్యాయాన్ని తన సొంత పార్టీలో ముందుగా అమలు చేయాలి. బీసీ నాయకుడు తప్పు చేస్తే తప్పే. ఓసీ నాయకుడు తప్పు చేసినా అదే తప్పు. బీసీ మహిళపై కఠినంగా స్పందిస్తే, ఇతర సామాజిక వర్గాల నాయకులపై కూడా అదే ప్రమాణం ఉండాలి. ఇది కుల రాజకీయాలను ప్రోత్సహించడం కాదు. కులం ఆధారంగా జరుగుతున్న వివక్షపై ప్రశ్నించడం. తెలంగాణ రాజకీయాల్లో బీసీల ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతోంది. జనాభాలో గణనీయమైన భాగస్వామ్యం ఉన్న బీసీలను రాజకీయంగా ఆకర్షించేందుకు అన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ కూడా బీసీ సంక్షేమం, బీసీ రిజర్వేషన్లు, బీసీ ప్రాతినిధ్యం అంటూ ముందుకు సాగుతోంది. అయితే బీసీ నాయకత్వానికి నిజంగా సమాన గౌరవం, స్వేచ్ఛ, రాజకీయ భద్రత కల్పిస్తున్నారా? లేక బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారా? అనే ప్రశ్నలకు పార్టీ ఆచరణ ద్వారానే సమాధానం చెప్పాలి. కొండా సురేఖ అంశంలో కాంగ్రెస్ తీసుకుంటున్న వైఖరి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నాయకుల విషయంలో గతంలో కనిపించిన మౌనం మధ్య పోలిక రావడం సహజం. ఈ పోలికను కేవలం రాజకీయ విమర్శగా కొట్టిపారేయలేం. బీసీ వర్గాల్లో అసంతృప్తి పెరిగితే అది కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాంగ్రెస్ సామాజిక న్యాయం గురించి దేశానికి పాఠాలు చెప్పాలంటే ముందుగా తన పార్టీలోనే సమానత్వాన్ని చూపాలి. పార్టీ క్రమశిక్షణకు ఒకే కొలమానం ఉండాలి. ఒకే తప్పుకు ఒకరికి హెచ్చరిక, మరొకరికి మౌనం ఉండకూడదు. నాయకుడి కులం చూసి క్రమశిక్షణ నిర్ణయిస్తే అది సామాజిక న్యాయం కాదు.. రాజకీయ సౌలభ్యం. తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది. కొండా సురేఖ విషయంలో స్పందించడం తప్పా? కాదు. కానీ అదే ప్రశ్నలు ఇతర నాయకుల విషయంలో ఎందుకు లేవు? ఇదే అసలు సమస్య. సామాజిక న్యాయం అంటే బీసీలకు నినాదాల్లో స్థానం ఇవ్వడం కాదు. నిర్ణయాల్లో సమాన స్థానం కల్పించడం. బీసీ నాయకురాలు మాట్లాడితే వెంటనే క్రమశిక్షణ గుర్తుకు రావడం, ఇతర సామాజిక వర్గాల నాయకులు మాట్లాడితే రాజకీయ అవసరాలు గుర్తుకు రావడం నిజంగా సామాజిక న్యాయం అనిపించుకుంటుందా? కాంగ్రెస్ సమాధానం చెప్పాల్సిన ప్రశ్న ఇదే.. కొండా సురేఖకు ఒక న్యాయం.. కోమటిరెడ్డికి మరో న్యాయమా? తెలంగాణ సమాజం ఇప్పుడు మాటలను కాదు.. పార్టీలు పాటించే ప్రమాణాలను గమనిస్తోంది. కాంగ్రెస్ సామాజిక న్యాయం నినాదం నిజమవ్వాలంటే.. ముందుగా ఆ న్యాయాన్ని తన పార్టీలోనే అమలు చేయాలి. లేకపోతే "బీసీలకు ఒక న్యాయం.. బలమైన వర్గాలకు మరో న్యాయం" అనే విమర్శకు సమాధానం చెప్పడం కష్టమవుతుంది.

## మాటల్లో న్యాయం.. చేతల్లో అన్యాయం




భారతదేశ రాజకీయాల్లో బీసీల పేరు వినిపించని ఎన్నిక లేదు. బీసీ ఓటు ప్రస్తావన లేని రాజకీయ పార్టీ లేదు. బీసీ సంక్షేమం పేరిట హామీలు గుప్పించని ప్రభుత్వం లేదు. కానీ బీసీల అసలు సంఖ్య ఎంత? వారి సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులు ఏమిటి? ప్రభుత్వ ఉద్యోగాలు, విద్య, రాజకీయ రంగాల్లో వారికి దక్కుతున్న అవకాశాలు ఎంత? అనే ప్రాథమిక ప్రశ్నలకు మాత్రం ప్రభుత్వాల వద్ద సమగ్రమైన, అధికారిక సమాధానాలు లేవు. ఎందుకంటే బీసీ కులగణన విషయంలో కేంద్రం, రాష్ట్రాలు రెండూ అసౌకర్యకరమైన మౌనం పాటిస్తున్నాయనే విమర్శలు బలపడుతున్నాయి. కులం ఆధారంగా రాజకీయాలు చేయడానికి అందరికీ ఇష్టం. కానీ కులాల వాస్తవ గణాంకాలను బయటకు తీయడానికి మాత్రం ఇష్టం ఉండటం లేదు. ఇదే బీసీల పట్ల పాలక వ్యవస్థల నిజమైన వైఖరిని ప్రశ్నార్థకం చేస్తోంది. భారత రాజ్యాంగం సామాజిక న్యాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

రిజర్వేషన్లు కూడా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే వచ్చాయి. అయితే, ఏ వర్గం ఎంత వెనుకబడి ఉంది? వారి జనాభా ఎంత? వారికి అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలు ఎంత? అనేది తెలియకుండా సమర్థవంతమైన విధానాలు రూపొందించడం ఎలా సాధ్యం? జనాభా లెక్కల్లో బీసీల ప్రత్యేక కులవారీ సమాచారం లేకపోతే, వారి వాటాను ఎలా నిర్ణయిస్తారు? ఇదే ప్రధాన ప్రశ్న. అంచనాలపై సంక్షేమ పథకాలు రూపొందించడం, ఊహాజనిత గణాంకాలతో రిజర్వేషన్లను సమర్థించుకోవడం కంటే సమగ్ర కులగణన ద్వారా వాస్తవాలను తెలుసుకోవడం ప్రభుత్వాల బాధ్యత.

దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంది. కాబట్టి సమగ్ర కులగణనను కూడా శాస్త్రీయంగా నిర్వహించే సామర్థ్యం కేంద్రానికే ఎక్కువ. అయినప్పటికీ బీసీ కులగణన విషయంలో కేంద్రం అనేక సందర్భాల్లో స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నట్లు కనిపిస్తోంది. బీసీలు దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్నారని రాజకీయ పార్టీలు తరచూ చెబుతాయి. అదే నిజమైతే వారి అసలు సంఖ్యను అధికారికంగా నమోదు చేయడానికి ఎందుకు వెనుకాడుతున్నారు? కులగణన వల్ల సామాజిక సమతుల్యతపై చర్చలు వస్తాయని భయమా? రిజర్వేషన్లపై కొత్త డిమాండ్లు వస్తాయనే ఆందోళనా? లేక ఇప్పటి రాజకీయ సమీకరణాలు మారిపోతాయనే సంకోచమా? ఏ కారణమైనా సరే, వాస్తవాలను దాచిపెట్టి సామాజిక న్యాయం సాధించలేం.

కేంద్రంపై నిందలు వేయడం రాష్ట్రాలకు సులభమే. కానీ తమ పరిధిలో బీసీల సామాజిక-ఆర్థిక స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేసి, అందుకు తగ్గ విధానాలు రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పూర్తిస్థాయిలో చిత్తశుద్ధి చూపుతున్నాయా? అన్న ప్రశ్న ఎదురవుతోంది. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో బీసీ రాజకీయాలు ఎప్పుడూ ప్రధాన చర్చగా ఉంటాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్యా సంస్థల్లో అవకాశాలు, ఉద్యోగాల్లో వాటా, రాజకీయ ప్రాతినిధ్యం.. ప్రతి అంశంలోనూ బీసీ నినాదం వినిపిస్తుంది. కానీ బీసీల సంఖ్యపై, ఉపకులాల వారీ వెనుకబాటుతనంపై, వనరుల పంపిణీపై సమగ్ర సమాచారం ప్రజల ముందు ఉంచడంలో ప్రభుత్వాల వైఖరి మాత్రం అంత స్పష్టంగా కనిపించడం లేదు. సర్వేలు చేయడం ఒకటి. ఆ సర్వేలో సేకరించిన సమాచారాన్ని అధికారిక విధానంగా మార్చడం మరోటి. కులగణన పేరుతో రాజకీయ ప్రచారం చేయడం వేరు. ఆ గణాంకాల ఆధారంగా చట్టబద్ధమైన సామాజిక న్యాయాన్ని అమలు చేయడం వేరు. రాజకీయ పార్టీల వ్యవహార శైలిపై ప్రధానంగా వినిపిస్తున్న విమర్శ ఇదే. ఎన్నికల సమయంలో బీసీ నాయకత్వం కావాలి. బీసీ ఓటు కావాలి. బీసీ ఆత్మగౌరవం కావాలి. బీసీ సంక్షేమ సభలు కావాలి. కానీ బీసీల సంఖ్యను అధికారికంగా లెక్కించాలంటే మాత్రం అడుగులు మందగిస్తాయి. ఇది కేవలం రాజకీయ విరుద్ధత కాదు; సామాజిక న్యాయం పట్ల చూపుతున్న ద్వంద్వ వైఖరి.

బీసీలను ఒకే సమూహంగా చూడడం కూడా సరైన విధానం కాదు. బీసీలలో అత్యంత వెనుకబడిన కులాలు ఉన్నాయి. కొంతమేర అభివృద్ధి చెందిన వర్గాలు ఉన్నాయి. అనేక ఉపకులాలు విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాల పరంగా ఇంకా వెనుకబడి ఉన్నాయి. సమగ్ర గణాంకాలు లేకపోతే ఈ అసమానతలు వెలుగులోకి రావు. బలమైన వర్గాలు ప్రయోజనాలను పొందుతుండగా, అత్యంత వెనుకబడిన వర్గాలు వెనుకబడిపోయే ప్రమాదం ఉంది. కులగణనకు వ్యతిరేకంగా వినిపించే ప్రధాన వాదన ఏమిటంటే, ఇది కుల రాజకీయాలను మరింత పెంచుతుందనేది. కానీ ప్రశ్న ఏమిటంటే.. కులాలు లెక్కించకపోతే కుల వివక్ష అంతరించిపోతుందా? సమాజంలో ఇప్పటికే కుల ఆధారిత అసమానతలు ఉన్నాయి. ఉద్యోగాలు, విద్య, ఆర్థిక స్థితి, రాజకీయ ప్రాతినిధ్యంలో వ్యత్యాసాలు ఉన్నాయి. వాస్తవాన్ని కొలవకుండా సమస్యను పరిష్కరించలేం. జ్వరాన్ని థర్మామీటర్‌తో కొలిచినంత మాత్రాన జ్వరం రాదు. అలాగే కులగణన చేసినంత మాత్రాన కులం సృష్టించబడదు. ఇప్పటికే ఉన్న సామాజిక వాస్తవాన్ని గణాంకాల రూపంలో నమోదు చేయడమే కులగణన. అయితే ఆ గణాంకాలను రాజకీయ ఆయుధంగా కాకుండా, సామాజిక న్యాయానికి శాస్త్రీయ ఆధారంగా ఉపయోగించాలి. ఇదే అసలు సవాలు.

బీసీలకు ముఖ్యమంత్రి పదవులు, మంత్రి పదవులు, కార్పొరేషన్ పదవులు, పార్టీ పదవులు ఇవ్వడమే బీసీ న్యాయం కాదు. కొద్దిమంది నాయకులకు పదవులు దక్కడం వల్ల కోట్లాది బీసీల సామాజిక సమస్యలు పరిష్కారం కావు. అసలు బీసీ న్యాయం అంటే.. వారి నిజమైన జనాభాను గుర్తించడం, కులాల వారీ వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేయడం, విద్యా అవకాశాలను పెంచడం, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యాన్ని విశ్లేషించడం, అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించడం, సంక్షేమ నిధుల పంపిణీలో సమానత్వం తీసుకురావడం. ఈ పనులన్నింటికీ తొలి అడుగు సమగ్ర, విశ్వసనీయ బీసీ కులగణనే. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకపై ఈ అంశాన్ని రాజకీయ ఆరోపణలకే పరిమితం చేయకూడదు. కేంద్రం రాష్ట్రాలపై, రాష్ట్రాలు కేంద్రంపై నిందలు వేయడం వల్ల బీసీలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పారదర్శకమైన, శాస్త్రీయమైన కులగణనకు స్పష్టమైన విధానం ప్రకటించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ వద్ద ఉన్న సామాజిక--ఆర్థిక వివరాలను ప్రజల ముందు ఉంచి, బీసీ వెనుకబాటుతనాన్ని తగ్గించేందుకు కార్యాచరణ రూపొందించాలి. గణాంకాలు లేని సామాజిక న్యాయం నినాదంగా మాత్రమే మిగిలిపోతుంది. లెక్కలు లేకుండా వాటాలు నిర్ణయిస్తే వివాదాలు తప్పవు. వాస్తవాలు బయటకు రాకుండా సంక్షేమం పేరుతో చేసే రాజకీయాలు చివరికి బీసీలను మళ్లీ మోసం చేయడమే అవుతుంది. బీసీలను ఓటు బ్యాంకుగా చూడటం ఆపి, వారి వాస్తవ సామాజిక స్థితిని లెక్కించే ధైర్యం ప్రభుత్వాలు చూపాలి. లేకపోతే దేశం మొత్తంగా ఒక ప్రశ్న అడుగుతూనే ఉంటుంది.. బీసీల కోసం ఇన్ని మాటలు చెబుతున్నారు సరే, అసలు బీసీ కులగణన ఎక్కడ?



శశిధర్ అక్కెల



## బంజారాల గుండె చప్పుడు.. తీజ్

తెలంగాణ బంజారా సమాజం అత్యంత వైభవంగా జరుపుకునే సంప్రదాయ పండుగల్లో తీజ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. శ్రావణ మాసంలో తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుక ప్రకృతి ఆరాధన, వ్యవసాయ జీవనం, కుటుంబ బంధాలు, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. పచ్చని మొలకలు, రంగురంగుల సంప్రదాయ దుస్తులు, అద్దాల అలంకరణలు, గైవాల్ పాటలు, ధమాళీ నృత్యాలతో తండాలు పండుగ వాతావరణంలో మునిగిపోతాయి. తీజ్‌లో ప్రధానంగా పెళ్లికాని యువతులు పాల్గొంటారు. సారవంతమైన మట్టితో నింపిన వెదురు బుట్టల్లో గోధుమ, శనగ, వరి తదితర విత్తనాలను నాటి తొమ్మిది రోజుల పాటు వాటిని సంరక్షిస్తారు.

ఉదయం, సాయంత్రం నీరు పోసి పూజలు చేస్తారు. మంచి భర్త లభించాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, తండా సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తారు. అందుకే తీజ్‌ను మొలకల పండుగగా, విత్తనాల పండుగగా, ప్రకృతి పండుగగా భావిస్తారు. తొమ్మిది రోజుల వేడుకలో ప్రతి రోజూ ఒక ప్రత్యేక ఆచారం ఉంటుంది. మొలకలు నాటడం, ఉయ్యాల ఉత్సవం, రేగు ముళ్లకు శనగలు గుచ్చే బోరడి బొమ్మెర్, సేవాలాల్ మహారాజ్‌కు నైవేద్యం, బాలాజీ--హనుమంతుల పూజ, చాడోక్లి పూజ, మేరమ్మ తల్లి ఆరాధన, గణ్‌గోర్ వేడుకలు నిర్వహిస్తారు. చివరి రోజు నాయకులకు పాగడీలు కట్టి, తీజ్ మొలకలను తలపై ఉంచి గౌరవిస్తారు. అనంతరం పాటలు, నృత్యాల మధ్య మొలకల బుట్టలను సమీపంలోని చెరువు, వాగు లేదా నీటి వనరుల్లో నిమజ్జనం చేస్తారు. తీజ్‌లో అన్నాచెల్లెళ్ల అనుబంధానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. తొమ్మిది రోజుల వేడుకల్లో అన్నదమ్ములు సోదరీమణులకు అండగా నిలుస్తారు. చివరి రోజు సోదరీమణుల పట్ల గౌరవం, ప్రేమను చాటే సంప్రదాయాలు నిర్వహిస్తారు. దీంతో ఈ పండుగ ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ బంధాలను బలోపేతం చేసే సామాజిక వేడుకగా నిలుస్తోంది. ఉత్తర భారతదేశంలో జరుపుకునే హర్యాళీ, కజరి, హర్తాళికా తీజ్‌లకు భిన్నంగా తెలంగాణ బంజారాల తీజ్ ప్రత్యేక సాంస్కృతిక రూపాన్ని కలిగి ఉంది. ఉత్తర భారత తీజ్‌లో శివ-పార్వతి ఆరాధన, వ్రతాలు ప్రధానంగా ఉంటే, బంజారా తీజ్‌లో మొలకలు, వ్యవసాయ జీవనం, ప్రకృతి ఆరాధనకు విశిష్ట స్థానం ఉంది. సంచార జీవితం నుంచి స్థిర నివాసాల వరకు బంజారా సమాజం తన ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును కాపాడుకుంటూ వచ్చింది. తండాలు కేవలం నివాసాలే కాదు, వారి సామాజిక-సాంస్కృతిక వ్యవస్థకు కేంద్రాలు. తెలంగాణలో ముఖ్యంగా ఆదిలాబాద్ ప్రాంతంతో పాటు పలు జిల్లాల్లో తీజ్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. నగరాల్లోనూ బంజారా సమాజం ఈ సంప్రదాయాన్ని కొనసాగించడం వారి మూలాల పట్ల ఉన్న అనుబంధానికి నిదర్శనం. తీజ్ కేవలం ఒక పండుగ కాదు.. బంజారా సమాజపు హృదయ స్పందన. మట్టి, నీరు, విత్తనం, మొలకలతో ముడిపడిన వారి జీవన తత్వానికి ఇది సజీవ సాక్ష్యం. ఆధునికత ఎంత విస్తరించినా వేర్లను మరవకూడదనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తోంది. పచ్చని తీజ్ మొలకల్లా బంజారా సంస్కృతి, తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యం తరతరాల పాటు సజీవంగా, సగర్వంగా వర్ధిల్లాలని ఆకాంక్షిద్దాం.



రామకృష్ణ గోగులముదాయ్
పొలిటికల్ సైన్స్ విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ
rk9944@gmail.com

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.